విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

ఆదివారం 24 ఆగస్టు 2025 8 పేజీలు

ఒంగోలుకు తరలిన ఎర్రదండు

రాష్ట్ర మహాసభలకు విజయవాడ నుండి భారీగా వెళ్లిన పార్టీ శ్రేణులు.. ప్రజా సమస్యల పరిష్కారానికి నాంది

విశాలాంధ్ర-విజయవాడ: భారత కమ్యూనిస్టు పార్టీ 28వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 23 నుండి 25వ తేదీ వరకు ఒంగోలులో జరుగుతున్న నేపథ్యంలో విజయవాడ నుండి శనివారం పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ మహాసభల్లో భాగంగా ఒంగోలు పురవీధుల్లో చేపట్టిన కార్యకర్తల భారీ ప్రదర్శనలో పార్టీ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు సారథ్యంలో మహాసభల బ్యానర్లు చేతపట్టుకుని, ఎర్ర చొక్కాలు ధరించి, అరుణా పతకాలతో పార్టీ శ్రేణులు కదంతొక్కారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు విజయవంతానికి విజయవాడ నగరం నుండి వేలదిగా పార్టీ నాయకులు, శ్రేణులు తరలివచ్చారని తెలిపారు. పార్టీ పూర్వ వైభవానికి ఈ సభలు నాందిపలకనున్నాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు గత ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కుంటిసాకులు చెబుతున్నారని, హామీలు అమలు చేసేవరకు ప్రభుత్వాన్ని నిలదిస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ మహాసభల్లో -మిగతా 2 లో ...

మహోన్నత నాయకుడు

సురవరం

సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : పేదల ప్రజల కోసం తన జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అని సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో సీపీఐ జాతీయ పూర్వ కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి -మిగతా 2 లో ...

సమస్యలు పరిష్కరించాలి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: పీఎంజేవీకే, సూర్య ఘర్ పథకం, టూరిజం అభివృద్ధి అమలులో ఉత్పన్నమవుతున్న సమస్యలన్నింటినీ పరిష్కరించి లబ్దిదారులకు త్వరితగతిన లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మ సాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ మినీ సమావేశ మందిరంలో జిల్లాలో పీఎం జేవీకే, సూర్య ఘర్ పథకాల అమలు, టూరిజం -మిగతా 2 లో ...

సమస్యలు లేని గ్రామాలను నిర్మించుకుందాం

ఎంపీ వల్లభనేని బాలశౌరి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- కూటమి ప్రభుత్వ సుపరిపాలనలో గ్రామాలలో ఎటువంటి సమస్యలు లేకుండా సస్యశ్యామలంగా ఉండేవిధంగా గ్రామాలను నిర్మించుకుందామని ఎంపీ వల్లభనేని బాలసౌరి అన్నారు. మండల పరిదిలోని ముంజులూరు, సాతులూరు, ములపర్రు, నాగన్నచెరువు, బర్రిపాడు గ్రామాలలో కోల్ ఇండియా వారి సౌజన్యంతో సిఎస్ఆర్ నిదుల నుండి 0.5 ఎంఎల్‌డి మైక్రో ఫిల్టర్ బెడ్లను, అలాగే మల్లంపూడి గ్రామంలో తాగునీటిని నిల్వచేసే సొంపును, వాటర్‌హెడ్ ట్యాంకును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కృషి, పట్టుదలతో గ్రామీణ ప్రాంతల ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఒకొక్క మైక్రోఫిల్టర్ బెడ్ ఖరీదు 12 . 63 లక్షలు కగా మొత్తం 5 గ్రామల మైక్రోఫిల్టర్ బెడ్ లకు -మిగతా 2 లో ...

ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

'స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర'లో కలెక్టర్ లక్ష్మీశ

విశాలాంధ్ర-వీరులపాడు : స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర సాధనలో ముందుగా ప్రజలలో అవగాహన పెరిగి, వారికి చైతన్య వచ్చినప్పుడే ప్రభుత్వ లక్ష్యాల సాధన సాధ్యమవుతుందని కలెక్టర్ లక్ష్మీ షా అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని జయంతి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ముందుగా ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరగాలని, ప్లాస్టిక్‌తో జరిగే అనర్థాలు ఏ విధంగా ఉంటాయో వివరించి వాటికి ప్రత్యామ్నాయంగా అనుసరించాల్సిన విధానాలను -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

ఒంగోలుకు తరలిన ఎర్రదండు

చర్చించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో విజయవాడ నగర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీగా తరలివెళ్లిన శ్రామికులు...

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు సారధ్యంలో మైలవరం నియోజకవర్గం నుండి శ్రామికులు పెద్ద సంఖ్యలో రాష్ట్ర మహాసభలకు తరలివెళ్లారు. ఈ సభల్లో భాగంగా తొలుత చేపట్టిన భారీ ప్రదర్శనలో శ్రామికులు భారీగా పాల్గొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరగడం చారిత్రాత్మకమైన ఘట్టమని అన్నారు. వెనబడిన వర్గాలకు ఎల్లప్పుడు అండగా ఉంటూ అనేక ఉద్యమాలు చేపట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఏకైక పార్టీ సీపీఐ అని అన్నారు. కష్టజీవుల ఆర్థిక పురోగతి సాధించేవరకు పోరాటాలు కొనసాగుతాయని, ఈ మహాసభల్లో చర్చించి పలు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతోందన్నారు.

మహోన్నత నాయకుడు సురవరం

చిత్రపటానికి శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కోట మాల్యాద్రి మాట్లాడుతూ 2000లో జరిగిన బషీరాబాగ్ విద్యుత్ ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. పేదల హక్కుల కోసం ఎన్నోసార్లు జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు. సాధారణ కుటుంబంలో పుట్టి జాతీయస్థాయి నాయకుడిగా ఎదిగిన సుధాకర్ రెడ్డి, తన కృషి, త్యాగం, నిబద్ధతతో ఎరుపు జెండా విలువలను నిలబెట్టారని చెప్పారు. ఆయన లేని లోటు పార్టీకి మాత్రమే కాకుండా పేద ప్రజలకు కూడా తీరనిదని మాల్యాద్రి అన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు తమ పోరాటాలకు మార్గదర్శకంగా ఉంటాయని, వాటిని కొనసాగించే దిశగా సీపీఐ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి ఉపన్యాసం మొదలుపెడితే ఎంతసేపైనా వినాలని అనిపించే అంత సున్నితమైన ప్రసంగం ఇస్తారని గుర్తుచేశారు. సుధాకర్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, కర్నూలులో చదువుకునే రోజుల్లో బ్లాక్ బోర్డు, చాక్‌పీస్‌ల కోసం పోరాటాలు నిర్వహించారని, విద్యాశాఖ అధికారులను ఆలోచింప చేశారని, ఏఐఎస్ఎఫ్ ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర, జాతీయ నాయకుడిగా ఎదిగి అనంతరం పార్టీ జాతీయ కార్యదర్శిగా, ఎంపీగా పనిచేసిన మహోన్నత వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. వారి ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందారపు యశ్వంత్(శశి), సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు మంగా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ జగన్నాథం, అధ్యక్షుడు కంజుల విఠల్ రెడ్డి, ఆటో యూనియన్ నగర అధ్యక్షులు కూరాకుల రాంప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు బన్నీ, నగర సమితి సభ్యులు తిరుమల, చెవుల పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అభివృద్ధిపై మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, శాసన సభ్యులు మహమ్మద్ నజీర్ అహ్మద్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పథకాల అమలులో ఉత్పన్నమవుతున్న సమస్యలకు సంబంధించి చేపట్టవలసిన పరిష్కారాలు జిల్లాలో టూరిజం అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగింది. సమీక్షా సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ పీఎంజేవికే పథకం మైనారిటీలకు సంబంధించినది, దీనికి సంబంధించిన అంశంపై గతంలోనూ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేయని పనులను చేశామని చెప్పి సర్టిఫికెట్లు తీసుకొచ్చారన్నారు. తదుపరి కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఆడిట్లో బయట పడ్డప్పుడు తీసుకున్న సొమ్మును వెనక్కి చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. పథకంలో ఏడు ఎకరాల్లో మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు, జీజీహెచ్ విస్తరణ కోసం బొంగరాల బీడు హాస్పిటల్ ల్యాండ్ వినియోగం, ఆటో నగర్ కార్మికుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, అంజుమాన్ ల్యాండ్‌లో మల్టీ పర్పస్ స్కిల్ సెంటర్ ప్రధాన ప్రాజెక్టులకు ప్రతిపాదించబడ్డాయన్నారు. మనకు అందుబాటులో ఉన్నటువంటి ఏడు ఎకరాల ప్రాంతంలో మైనార్టీ స్కూల్స్ ఏర్పాటుకు, బొంగరాల బీడు లోని సుమారు 6 ఎకరాలలో హాస్పిటల్ నిర్మాణంలో ఔట్ పేషెంట్ బ్లాక్, ఓపి, డయాగ్నస్టిక్ వార్డులు నిర్మించాలని, అలాగే అంజుమాన్ మల్టీ పర్పస్ స్కిల్ సెంటర్ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ పథకాలకు సంబంధించి డీపీఆర్లు ఫేజ్ వైజ్ గా సిద్ధం చేయడం జరుగుతున్నదన్నారు. అలాగే సూర్య ఘర్ పథకం క్రింద గుంటూరు పార్లమెంటు పరిధిలో లక్ష 16 వేలమంది సూర్య ఘర్ పథకం క్రింద రిజిస్టర్ అయ్యారన్నారు. ఎన్‌టీఆర్ మానస సరోవరం, పేరేచర్ల వద్ద వున్న నందనవనం, ఉండవల్లి గుహలు, ఉప్పలపాడు విదేశీ పక్షుల కేంద్రం అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు మంజూరు కోరడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ ఖాజావలి, సిపిఓ శేషశ్రీ, జిల్లా టూరిజం శ్రీరమ్య, డిఎఫ్ఓ హిమ శైలజ, ఎల్‌డిఎం మహిపాల్ రెడ్డి, విద్యుత్, మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ తమతో ఒక సంచిని తీసుకెళ్లాలి

ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ ఆఫీసర్ జి.జయలక్ష్మి

పారిశుధ్య కార్మికులతోనే ఇది సాధ్యం : నగర మేయర్ భాగ్యలక్ష్మి

వర్షాకాలంలో అనారోగ్యం బారిన పడకుండా చర్యలు : కమిషనర్ ధ్యానచంద్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ఇంటి నుంచి బయటకు వెళ్లే ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కరూ తమతో పాటు ఒక సంచిని తీసుకెళ్లాలని రాష్ట్ర చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ ఆఫీసర్ జి.జయలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో పాత బస్తీ చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నగరపాలక సంస్థ చేస్తున్న చర్యలు ప్రశంసించదగ్గ విషయమని, ఒకవైపు నగరంలో డీసిల్టింగ్, వర్షపు నీరు రోడ్డుపైన నిల్వ ఉండకుండా మొన్సూన్ రెస్పాన్స్ టీం ఏర్పాటు లాంటి చర్యలు తీసుకుంటున్న వీఎంసీ కమిషనర్, నగర మేయర్‌ను అభినందించారు. ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రజలు వాడే గుడ్డ సంచైన, జ్యూట్ బ్యాగ్ అయినా ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ తమ దగ్గర సంచి ఉంచుకొని, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పడవేయకుండా ఆ సంచిలో వేసి చెత్తబుట్టలో వెయ్యాలన్నారు. తద్వారా కాలువల్లో వ్యర్థాలు చేరే అవకాశం ఉండదని, కాలువలు పూడిపోకుండా ఉంటాయని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే దేశంలో పెను మార్పు సంభవిస్తుందన్నారు. నగర మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నగరం భౌగోళిక విధానం మిగతా నగరాలవలే కాకుండా ఒకవైపు కొండలు మరోవైపు కాలువలతో నగరం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. అలాంటి నగరం పారిశుధ్య నిర్వహణలో దేశంలోనే అత్యుత్తమమైన సూపర్ స్వచ్ లీగ్ పురస్కారాన్ని అందుకుందన్నారు. అది కేవలం పారిశుధ్య కార్మికుల వల్లే సాధ్యమైందని, వర్షాకాలమైన రైన్ కోట్లు ధరించి వానలో పనిచేసే పారిశుధ్య కార్మికుల శ్రమ వెలకట్టలేనిదన్నారు. గార్బేజ్ ఫ్రీ సిటీలో వచ్చిన సెవెన్ స్టార్ రేటింగ్‌ను మనం ఇలాగే కాపాడుకుంటూ ఉండాలని, పారిశుధ్య కార్మికులతో మనం సహకరిస్తూ వ్యర్థాలను కేవలం చెత్తబుట్టలోనే వేసి కాలువల్లో వేయకుండా చూసుకునే బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్రతినెలా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఒక అంశంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, ఈనెల మొన్సూన్ హైజిన్ ద్వారా వర్షాలు పడినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందులో భాగంగా హ్యాండ్ వాష్-క్రిమి కీటకాలు సోకకుండా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నగరంలో నిరంతరం డీసిల్టింగ్ ప్రక్రియ నిర్వహిస్తూ కాలువల్లో నీటి ప్రవాహం ఆగకుండా చర్యలు తీసుకోవటంతో పాటు దోమల నిర్మూలనకు యాంటీ మలేరియా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే ప్రమాదం, పర్యావరణ హితమైన వస్తువులనే వాడకం వల్ల జరిగే ప్రయోజనం, దోమలు వృద్ధి చెందకుండా వాటిని వీఎంసీ ఎలా నిర్మూలిస్తుందనే అంశంపై స్టాల్స్‌ని ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక బృందాలు తయారు చేసిన గుడ్డ సంచుల ప్రత్యేక స్టాల్, వన్‌ఎర్త్-వన్ లైఫ్ వారిచే హోమ్ కంపోస్టు, మొక్కల పెంపకం అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా మరొక స్టాల్ ఏర్పాటుచేసి ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేసిన జ్యూట్ బ్యాగ్ స్టాల్‌లో కమిషనర్ సంచులను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, సీఈ శ్రీనాథ్‌రెడ్డి, యూసీడీ పీఓ వెంకటనారాయణ, ఈఈ శ్రీనివాస్, హార్టికల్చర్ డీడీ చంద్రశేఖర్, ఏఎంఓహెచ్ డా.అన్నపూర్ణ, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా.సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు లేని గ్రామాలను నిర్మించుకుందాం

63 .15 లక్షల రూపాయలను ఖర్చుచేసి మైక్రోఫిల్టర్ బెడ్ లను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు .కూటమి సుపరిపాలనలో తొలి మెట్టుగా సూపర్ సిక్స్ పథకాలను అమలుచేసి ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చారని అన్నారు. అనంతరం కంచడం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన బ్యాంక్ ఆఫ్ ఇండియాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మలిశెట్టి వెంకటరమణ, అయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారిని లావణ్య, జిల్లా వైద్యాధికారిని సుహాసిని, నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి బాలకృష్ణ, తహసీల్దార్ రవికుమార్, మండల అభివృద్ధి అధికారి బి రాజు, సర్పంచి మారపాక మహాలక్ష్మి, జయంతి గ్రామస కార్యదర్శి రామారావు, ఎంపీటీసీ సభ్యులు ఇప్పల్లి సత్యనారాయణ రెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు చేతురాల భరత్ రెడ్డి, స్థానిక ప్రజలు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలి

విశాలాంధ్ర-పమిడిముక్కల: విద్యార్థులు విద్యాభివృద్ధికి కృషిచేసే ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. శనివారం కపిలేశ్వరపురం పాఠశాలలో "పవర్ మెక్ ఫౌండేషన్ " సహకారంతో స్థానిక తెదేపా నాయకులు తాతినేని రమేష్ బాబు ఆధ్వర్యంలో 300 మంది విద్యార్థులకు రూ. 75000లు విలువ చేసే నోటు పుస్తకాలు ఎమ్మెల్యే వర్ల, దాత ఫౌండేషన్ చైర్మన్ సజ్జా కిషోర్ బాబు, లక్ష్మి దంపతులు చే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.తులసీ రాణి ఉపాధ్యాయులు స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా 4 గంటలు నిలుపుదల

విశాలాంధ్ర-విజయవాడ: నగరంలోని మహాత్మగాంధీ ఇండోర్ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో విద్యుత్ మరమ్మతులు, సర్దుబాటు కారణంగా ఆదివారం ఉదయం 8 నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ కాలనీ, ఏయస్ రామారావు రోడ్డు, సిద్దార్థ పబ్లిక్ స్కూల్ రోడ్డు, కోనేరు లక్ష్మయ్య వీధి, ఖాంధారి హెటల్ రోడ్డు, పార్క్ రోడ్డు తదితర ప్రాంతములలో సరఫరా ఆపడంతో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంగీత కళాశాలలో వాయిద్య డిప్లొమో కోర్సులు

విశాలాంధ్ర-విజయవాడ: నగరంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వం సంగీత కళాశాల నందు వాయిద్య సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి శనివారం ఒ ప్రకటనలో తెలిపారు. గాత్రం, వీణ, వయోలిన్, మృదంగం, తబల, కూచిపూడి, భరత నాట్యం విభాగాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల కార్యాలయం నందు అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైకోర్టులో ఉద్యోగాలకు ఆన్‌లైన్ పరీక్షలు

విశాలాంధ్ర-పెడన : మండలంలోని నందమూరు వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఏపీ హైకోర్టు ఆన్లైన్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ బి ఆర్ ఎస్ రెడ్డి, అడ్మిన్ పి అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10:30 వరకు జరిగిన మొదటి షిఫ్టులో 181 మందికి గాను 127 మంది హాజరయ్యారని అన్నారు. మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల నుంచి రెండు గంటల వరకు జరిగిన రెండో షిఫ్ట్ లో 180 మందికి గాను 129 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుండి ఐదు గంటల 30 నిమిషాల వరకు జరిగిన మూడో షిఫ్ట్ లో 180 మందికి గాను 128 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

దస్తావేజులు పోయినవి

యన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ, సీతారాంపురం, కోటిలింగం వీధి, డోర్ నెం. 30-20/1-18 కాపురస్తులు కపిలవాయి రామమోహనరావు గారి కుమారుడు కపిలవాయి ప్రకాష్ కుమార్‌కు సంబంధించిన దస్తావేజులు ఇబ్రహీంపట్నం సబ్ రిజిష్ట్రారు వారి ఆఫీసులో తేది : 03-04-2010 ద.నెం.1256/ 2010రుగా రిజిష్ట్రారు కాబడిన విక్రయ దస్తావేజు మరియు ఇతర దస్తావేజులను ఫోటోస్టాట్ తీసుకుని యల్.ఆర్.యస్.కు అప్లై చేయటానికి సి.ఆర్.డి.ఏ ఆఫీసుకు వెళ్తుండగా పైన తెలిపిన ద.నె. 1256/2010 రు ఒరిజినల్ మార్గమధ్యలో పోయినవి. ఎవరికైనా దొరికినచో పై అడ్రస్సుకు కానీ, సెల్ 9394662503కు తెలుపగలరు.

CHANGE OF NAME

I, MOHAMMAD SALEEM (Old Name) S/o. Babu Mohammed, R/o. D.No. 27-6-86, Krishna Estates, Prakasam Road, Governorpet, Vijayawada-520 002, A.P, I have changed my name as MOHAMMED SALEEM (New Name). Hereafter my Name is Known as MOHAMMED SALEEM.

భారతికి సారధి నివాళులు

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వమండలం అయ్యంకి గ్రామ సర్పంచ్ నాగనబోయిన సునీల్(కారకంపాడు) తల్లిభారతి (62) మృతికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి నివాళులర్పించారు. శుక్రవారం సాయంత్రం తన సమీపబంధువైనభారతి చనిపోవుగా శనివారం ఉదయం ఆయన కారకంపాడులో మృతదేహంపై పూలదండలు వేసి కుటుంబ సభ్యులైన ఇద్దరు కుమార్తెలను, కుమారుడు సునీల్ నుఓదార్చారు. అలాగే పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలేఅనిల్ కుమార్, మండల వైసీపీ అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, రాష్ట్ర బీసీ నాయకులు కృష్ణ యాదవ్, శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, మండల పార్టీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, కోసూరు మాజీ సర్పంచ్ చిందావీర వెంకట నాగేశ్వరరాజు, మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, సన్నిహితులు, ప్రజాప్రతినిధులు పాల్గొని నివాళులర్పించారు.

రోడ్డుకు మరమ్మతులు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర-ఏకొండూరు : అయితే ఈ కథనంతో పూర్తి స్థాయిలో స్పందించిన ఆర్ అండ్ బి అధికారులు శనివారం రోడ్డు తాత్కాలిక నిర్మాణ పనులను ప్రారంభించారు. తాత్కాలిక నిర్మాణ పనులపై మాట్లాడిన ఆర్ అండ్ బి ఎఈ అచ్చారావు మాట్లాడుతూ ఏ కొండూరు చైతన్య నగర్ అడ్డరోడ్డు 111వ కిలోమీటర్ నుండి 117 వ కిలోమీటర్ వరకు అంటే వేపి చెట్టు వరకు ప్రస్తుతం తాత్కాలికంగా రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చడం జరుగుతుందని ఆయన తెలిపారు. అలానే తాత్కాలిక రోడ్డు నిర్మాణ దిశగా రూ 89 లక్షల రూపాయల నిధులతో కూడిన ఎస్టిమేషన్ ను ఆర్ అండ్ బి ఉన్నత స్థాయి అధికారులుకు పంపినట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల సూచన మేరకు నిధులు మంజూరు కాగానే రోడ్డు విస్తరణపరులను పూర్తిస్థాయిలో చేపడుతామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర-కృత్తివెన్ను: బహిరంగ ప్రదేశాలు వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేవారు అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ ఎ పైడిబాబు శనివారం తెలిపారు. ఉత్సవాలలో అధిక సబ్దాలను సృష్టించే డిజేలు నిషేధమని తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పెదపారుపూడి : టీడీపీ సీనియర్ నేత చప్పిడి కిషోర్ తన సొంత నిధులు రూ50 వేలు మండలంలోని చినపా రుపూడి గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ నరేష్ (38) మృతి చెందిన విషయం తెలుసుకుని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శనివారం మృతుని కుటుంబ సభ్యులకు అందించినట్లు ఎస్సీ సి సాధికార సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు దగాని లెనిన్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలలోకి వెళితే మండలంలోని చినపారుపూడి గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ నరేష్ లారీ డ్రైవర్ గా పనిచేస్తూ పంజాబ్ - ఢిల్లీ మార్గమధ్యలో గుండె పోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ 4 పథకం ద్వారా బంగారు కుటుంబాన్ని (నిరుపేద కుటుంబం) ఆదుకునే విషయములలో పంజాబ్ ప్రాంతంలో ఉన్న మృతదేహాన్ని చినపారుపూడి గ్రామానికి తెప్పించేందుకు మార్గదర్శకులను (ధనవంతులు) ఏర్పాటు చేశారు. మండల ప్రజలు హర్షాతిరేకం వ్యక్తం చేశారని టిడిపి మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు తెలిపారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలకు వెళ్లిన శ్రేణులు

విశాలాంధ్ర - చల్లపల్లి : ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రారంభం కానున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు అవనిగడ్డ నియోజక వర్గం నుండి సీపీఐ నాయకులు తరలి వెళ్లారు. 23 నుండి 25 వరకు మహాసభలు జరగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రంలో పాల్గొనేందుకు సుమారు వంద మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జీ, సీపీఐ కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, మహిళా సమాఖ్య జిల్లా, నియోజక వర్గ నాయకులు రాళ్ల కంఠంనేని జోత్స్నా దేవి, కంచర్ల ప్రభు కుమారి, సిపిఎం మండల కార్యదర్శి యద్దన పూడి మధు, సీఐటీయూ నాయకులు మహమ్మద్ కరీముల్లా లు జెండా ఊపిరి ర్యాలీ ప్రారంభించారు.

మహాసభలకు తరలి వెళ్లిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర, మచిలీపట్నం : ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలకు మచిలీపట్నం నుంచి సీపీఐ నాయకులు పెద్దఎత్తున స్థానిక మోదుమూడి శ్రీహరిరావు భవనం నుండి శనివారం బయలుదేరారు. సీపీఐ శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో శనివారం నుంచి మూడు రోజులు పాటు ప్రకాశం జిల్లా ఒంగోలులో జరగనున్న పార్టీ రాష్ట్ర మహాసభలలో పాల్గొనేందుకు మచిలీపట్నం నుంచి సీపీఐ నాయకులు పలు వాహనాలలో తరలి వెళ్లారు. తొలుత మహాసభలకు బయలుదేరిన వాహనాలను సీపీఐ నాయకురాలు దేవాభక్తుని నిర్మల జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, నియోజవర్గ కార్యదర్శి ఓడుగు చైతన్యకుమార్, సహాయ కార్యదర్శి యర్రంశెట్టి ఈశ్వరరావు, తాటిపర్తి రామకృష్ణ, కర్నాటి అర్జునరావు, కే గగన్, కే వాసు, లక్ష్మణరావు, మహిళా సమాఖ్య నాయకురాలు ఓడుగు రత్నకుమారి, ఓడుగు నాగ ఫణింద్ర, సిద్దిరెడ్డి మౌలాలి, బాబి, శ్రీనివాస్, మోక జయలక్ష్మి, అనగాని లక్ష్మి, షేక్ జాన్ బీ తదితరులు పాల్గొన్నారు.

పామర్రు నియోజకవర్గం నుంచి వెళ్లిన నేతలు

విశాలాంధ్ర-కూచిపూడి: భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఒంగోలు పట్టణంలో నిర్వహిస్తున్న మహాసభలకు పామర్రు నియోజకవర్గ నేతలు శనివారం వెళ్లారు. సీపీఐ పామర్రు నియోజకవర్గ సమితి కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కోసూరు వెంకట అప్పారావు, శాఖా కార్యదర్శులు కొండా నాగేశ్వరరావు (కూచిపూడి), బోరుకాటి నరసిం హారాజు (కోసూరు)తో పాటు సభ్యులు సానుభూతి పరులు తరలి వెళ్లారు. కూచిపూడి సెంటర్లోని సిపిఐ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు జండా ఊపి పంపారు.

చలో ఒంగోలు...

విశాలాంధ్ర-ఎ కొండూరు : సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలకు .ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలం నుండి ఒంగోలులో జరిగే శ్రమజీవుల మహా ప్రదర్శనకు సీపీఐ ఎన్టీఆర్ జిల్లా వర్గ సభ్యులు మేకల డేవిడ్ తదితరులు వెళ్లారు.

సీపీఐ జగ్గయ్యపేట బృందం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : ఒంగోలులో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు జగ్గయ్యపేట బృందం బయలు దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ప్రముఖ న్యాయవాది జూనెబోయిన శ్రీనివాసరావు, జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, మండల కార్యదర్శి మెటికల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు నంబూరి చలపతిరావు, షేక్ మీరా, రాణి, కుమారి, ఆదెమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కరిసే మధు, ఏ.ఐ.ఎస్.ఎఫ్ కార్యదర్శి షేక్ చాందు, నాయకులు తురకా రాంబాబు, ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం నుండి మహాసభకు తరలి వెళ్లిన కామ్రేడ్స్

విశాలాంధ్ర-గన్నవరం : సీపీఐ 28వ రాష్ట్ర మహాసభకు గన్నవరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఒంగోలు నియోజ కవర్గ కార్యదర్శి కాట్రగడ్డ రామ చంద్రజోషి, శనగల సుభారెడ్డి, నూతక్కి రామ్మోహన్, వెంగాళ్ల శివయ్య, వెంగళ్ల రంగారావు, కట్టవరపు బెనర్జీ, కె శేషగిరిరావు, చాగంపాటి వెంకటేశ్వరరావు, చాగంటిపాటి భవాని ప్రసాద్, రంగారావు తదితరులు వెళ్లారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలకు భారీగా తరలి వెళ్ళిన కార్యకర్తలు

విశాలాంధ్ర వీరులపాడు : ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలకు మండలం నుండి సీపీఐ కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. మూడు రోజులపాటు జరిగే ఈ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయడంతో పాటు కార్మిక సమస్యలపై పోరాడేది, పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడేది, అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసేది వామపక్ష పార్టీలేనని, దీనికి అనుగుణంగానే సీపీఐ బలాన్ని గట్టిగా చాటి చెప్పేందుకు ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసేందుకు మండలం నుండి భారీగా తరలి వెళుతున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

రాష్ట్రంలో విజయవంతంగా అన్న క్యాంటీన్లు

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : పేదవాళ్ల ఆకలిని తీర్చేందుకు గతంలో తమ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ప్రారంభించి 5రూపాయలకే మూడు పూటలా నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసేసిందని, తిరిగి కూటమి ప్రభుత్వం వచ్చాక అన్న క్యాంటీన్లను పునరుద్దరించామని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నగరంలోని మూడు స్థంబాల సెంటర్ వద్ద గల అన్న క్యాంటీన్లో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర దాతల సహకారంతో 75 వేల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించి స్వయంగా నీటిని తాగారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిదులతో మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల ద్వారా 5రూపాయలకే స్వచ్ఛమైన ఆహారాన్ని అందిస్తున్నాని, చాలామంది దాతలు ముందుకు వచ్చి అన్న క్యాంటీన్ల నిర్వహణకు తమ వంతు సాయం అందిస్తున్నారని, నగరంలోని వైద్యులు దన్వంతరీ తమ వంతు సాయంగా గత సంవత్సరం లక్ష రూపాయలు, ఈ సంవత్సరం లక్ష రూపాయలు అందించారన్నారు. ప్రస్తుతం వారి మనుమడు డా. వివేక్, డా. వైష్ణవిల వివాహ సందర్భంగా ముందుకువచ్చి అన్న క్యాంటీన్లో 75 వేల రూపాయల వ్యయంతో ఆర్వో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. మున్సిపల్ సహాయ కమిషనర్ గోపాల్ రావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, వైద్యులు దన్వంతరీ, వివేక్, వైష్ణవి పాల్గొన్నారు.

చవితి పందేళ్లకు అనుమతి తప్పనిసరి : సీఐ

విశాలాంధ్ర-పెడన: ఈనెల 27న జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా పెడన నియోజకవర్గం లో ఏర్పాటు చేసుకునే వినాయక చవితి పందిళ్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సిఐ నాగేంద్రప్రసాద్ కోరారు. శనివారం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గణేష్ మండపాలు ఏర్పాటు చేసేవారు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 11 రోజుల్లోపు గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని ఉత్సవాలకు డీజే అనుమతి లేదని సాధారణ మైక్ సిస్టం ని మాత్రమే వినియోగించాలని తెలిపారు. గణేష్ మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీస్ ఉన్నతాధికారుల సూచనలు తప్పనిసరిగా అమలు చేయాలని సీఐ పేర్కొన్నారు. నిమజ్జనం సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే పూర్తి బాధ్యత కమిటీలదేనని స్పష్టం చేశారు.వినాయక చవితి ఉత్సవాలను ప్రజలందరూ సంతోషంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సిఐ నాగేంద్రప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో పెడన ఎస్సై గంట్ల. సత్యనారాయణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సురవరం మృతి పార్టీకి తీరని లోటు

సుధాకరరెడ్డికి సీపీఐ నివాళి

విశాలాంధ్ర- చల్లపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీలు పేర్కొన్నారు. చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో శుక్రవారం రాత్రి మృతి చెందిన సుర వరం సుధాకర్‌రెడ్డికి శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండుసార్లు లోక్‌సభ సభ్యునిగా పనిచేసిన సురవరం నిష్కళంక నాయకుడిగా ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. ఆర్థిక శాఖ సలహా కమిటీ సభ్యులుగా ఉండి అనేక సంస్కరణలో భాగస్వాముల య్యారన్నారు. సీపీఐ అనుబంధ విద్యార్థి, యువజన సంఘా లలో చురుకైన పాత్ర పోషించారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీలో జాతీయ సమితి సభ్యులుగా కార్యవర్గ సభ్యుడిగా కార్యదర్శి వర్గ సభ్యుడిగా డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి ప్రధాన కార్యదర్శిగా మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ఆయన వామపక్ష రాజకీయాలలో భాగస్వామిగా ఉంటూ అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితికి రెండుసార్లు సేవలందించిన సురవరం మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటుగా ఆయన వివరించారు. తొలుత పార్టీ నాయకులు కార్యకర్తలు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటా నికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు కంఠంనేని జ్యోత్స్న దేవి, సీపీఐ నాయకులు మల్లుపెద్ది నాగభూషణ రావు, నక్క శ్రీనివాసరావు, కొల్లూరి శ్రీధర్, పెసుమత్స ప్రభా కర్ రావు, సిద్దాబత్తుల బాలయ్య, వాసు, హేమార్జున, కంచర్ల ప్రభుకుమారి, రాజారత్నం, సిపిఎం నాయకులు యద్దన పూడి మధు, మహమ్మద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య నివాళి

సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్న కుమారి నివాళులు అర్పించారు. ఆయన మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా సమాఖ్య తరఫున విప్లవ జోహార్లర్పించారు.

సురవరంకు పామర్రు నేతలు నివాళులు

విశాలాంధ్ర-కూచిపూడి: సీపీఐ జాతీయ (హ్యాట్రిక్) మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ, తెలంగాణ ఉద్యమ నేత, కమ్యూనిస్టు దిగ్గజం సురవరం సుధాకర్ రెడ్డి (83) మృతితో సిపిఐ పార్టీ ఉద్యమ యోధుడినికోల్పోయిందని వక్తలు పేర్కొని సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణాజిల్లాలోని మొవ్వ మండలం కూచిపూడి-పెదపూడి సెంటర్లోని కాంచన సిపిఐ భవనంలో శనివారం పామర్రు నియోజకవర్గం ఆధ్వర్యంలో సురవరం సుధాకర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి లాల్ సలాం చేశారు. ఈ కార్యక్రమంలో పామర్రునియోజకవర్గ సిపిఐ సమితి కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కోసూరు వెంకట అప్పారావు, శాఖా కార్యదర్శులు బోరుకాటి నరసింహారాజు (కోసూరు), కొండా నాగేశ్వరరావు (కూచిపూడి),సభ్యులు ప్రొజర్లమెహర్ అలీ, బల్లా సుబ్బారావు, పార్టీ సానుభూతిపరుడుచిందా రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల క్యూ

విశాలాంధ్ర-ఎ కొండూరు : యూరియా కోసం రైతులు ఎ కొండూరు మండలం పోలిశెట్టి పాడు సహకార సొసైటీ వద్ద క్యూ కట్టారు శుక్రవారం సాయంత్రం పోలిశెట్టిపాడు పిఏసిఎస్‌కు 10 టన్నులు యూరియా రావడంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు పాసుబుక్ ఆధార్ జిరాక్స్‌తో క్యూలో నిలబడి శనివారం యూరియాను రైతులు కొనుగోలు చేసినట్లు పిఏసిఎస్ కార్యదర్శి కోటేశ్వరరావు తెలిపారు. 225 కట్లు యూరియా రాగా రైతుకి ఒక కట్ట చొప్పున అందించామని ఆయన తెలిపారు. యూరియా కోసం గోపాలపురం గ్రామం నుండి వచ్చిన ఒక మహిళ రైతు క్యూలో నిలబడి కళ్ళు తిరిగి కింద పడిపోవడంతో అక్కడ ఉన్న రైతులు ఆమెను పక్కన కూర్చోబెట్టి సపర్యలు చేశారు.

ఒక కట్ట కోసం ఎనిమిది గంటలకు క్యూలో ...

విశాలాంధ్ర-గన్నవరం : రైతే దేశానికి వెన్నుముక అంటున్న రాజకీయ నాయకులకు రైతు కష్టాలు తీర్చలేని ప్రభుత్వాలు రైతు కరిపంట వేసి రెండు నెలలు కావస్తున్న పంట పొలానికి వేసే కట్ట యూరియా కోసం 8 గంటల నుండి పడికాపులు పడుతున్నారు. గన్నవరం గాంధీభవన్ సెంటర్లో ఎరువుల దుకాణం వద్ద చోటు చేసుకుంది. రైతు కురుస్తున్న వర్షాలకు సంతోషంగా నాట్లను నాటు కొని పంటకు బలం కోసం యూరియా కోసం అవస్థలు పడుతు న్నాడు. గన్నవరం మండల వ్యవసాయ అధికారి కె శివప్రసాద్ కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఎక్కడ స్టాక్ ఉంటే రైతులకు ప్రభుత్వం ధరకే ఇవ్వాలని ఆదేశించగా గన్నవరం మండలం ముస్తాబాద్ రైతు భరోసా కేంద్రానికి వచ్చిన నాలుగు టన్నులు యూరియా గన్నవరం గాంధీభం సెంటర్లో వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ షాపులో క్యూలో నిలబడిన రైతులకు ఆధార్‌కార్డు పట్టాదారు పాస్‌పుస్తకం ప్రకారంగా 2 ఎకరాలకు 1 యూరియా కట్ట చొప్పున పంపిణీ చేశారు.

ఏఎంసీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఎస్ అక్బర్ బాషా, సిబ్బంది చీపురులు పట్టుకుని కార్యాలయంలో బూజు దులిపి పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న బాలమ్మను సత్కరించారు. జిల్లాపంచాయితీ అధికారిణి డాక్టర్ జె అరుణ ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ.వి. ఎస్. ఆర్. ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశా లలో శనివారం (మూడవ) స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే పల్లపు ప్రాంతాలలో, మురుగు కాలవలలో నీరునిల్వతో లార్వా, దోమలను నివారణకు చర్యలు గురించి వివరించారు. కళా శాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ కే.ఆర్. మంజుల, అధ్యాపకులు డాక్టర్ టి శ్రీకాంత్, డాక్టర్ ఎం అనిల్, శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నగరంలో కొత్త పార్కులను అభివృద్ధి చేయండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందించేందుకు కొత్త పార్కులను అభివృద్ధి చెయ్యాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా కమిషనర్ శనివారం ఎంజి రోడ్, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కొత్త పార్కులను ఎల్‌బిఎస్ నగర్, ఎస్సీ కాలనీ, వాంబే కాలనీలో బీజేఎఫ్ బ్లాక్‌ల వద్ద కొత్త పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించబో తున్నట్లు తెలిపారు. నగరంలోని మొక్కలు లేని డివైడర్లలో మొక్కలు నాటాలని, కాలుష్యం తగ్గించేందుకు రోడ్డుకి ఇరువైపులా మొక్కలను నాటే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థికి ఉన్నతస్థానం



విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: చిన్నతనం నుంచి ప్రభుత్వ వసతిగృహంలో ఉండి విద్యనభ్యసించిన విద్యార్థి ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉన్నతస్థానం సాధించారు. స్థానిక సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహం అధికారి పి.అర్జునరావు తెలిపిన వివరాల ప్రకారం, ఎ.కొండూరు మండలం రేపూడి తండా గ్రామానికి చెందిన భూక్యా జాన్సన్ చిన్నతనం నుంచి ఇంటర్ పూర్తయ్యేంత వరకు విస్సన్నపేటలోని వసతిగృహంలో ఉండి, ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకుని, 2019లో అంగలూరు డైట్ కళాశాలలో సీటు సాధించి, బీఎడీ పూర్తి చేశారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించగా 94.5 మార్కులు సాధించి, ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచినట్లు వివరించి, సంబంధిత విద్యార్థిని అభినందించారు.

గ్రామ ప్రముఖుని మృతి

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: మండలంలోని తెల్లదేవరపల్లికి చెందిన గ్రామ ప్రముఖులు గంగవల్లి వెంకట చలపతిరావు(84) శనివారం తెల్లవారుజామున అనారోగ్య కారణాలతో మరణించారు. రామాలయ నిర్మాణం నాటి నుంచి ఆలయ కమిటీ శాశ్వత సభ్యునిగా కొనసాగిన చలపతిరావు, గ్రామంలోని పలు ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో ప్రముఖ పాత్ర పోషించారు. చలపతిరావు మరణ సమాచారం తెలుసుకున్న గ్రామసర్పంచి రాయల నాగరాణి, ప్రజలు ఆయన మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన : సౌమ్య

విశాలాంధ్ర నందిగామ:- ఉపాధి ఎంత చిన్నదైనా అది మొదటి అడుగుగా భావించి ముందుకు సాగాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు శనివారం స్థానిక కె.వి.ఆర్ కళాశాల నందు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్(చిన్ని) సౌజన్యంతో స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను స్థానిక కూటమి నేతలతో కలిసి ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెవిఆర్ కళాశాల లో జరుగుతున్న ఈ జాబ్ మేళాలో నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఒక వేదికగా నిలిచిందని పేర్కొన్నారు ఉపాధి ఎంత చిన్నదైనా అది మన జీవితంలో మొదటి మెట్టుగా భావించి ముందుకు సాగాలని యువతీ యువకులకు సూచించారు. ఈ జాబ్ మేళాలో ప్రతి పాల్గొన్న ప్రతి ఒక్కరికి ముందుగా ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం జాబ్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ జాబ్ మేళాలో మొత్తం 22 కంపెనీలు పాల్గొనగా 1071 మంది యువతీ యువకులకు జాబులు అందించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పలువురు హెచ్ ఓ డి లు వెల్లడించారు జాబ్ మేళా ఉదయం 11 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ (బాబు),మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి,వివిధ హోదాల చైర్మన్లు కూటమి నేతలు యువతీ యువకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత దిశగా భావితరాలు పయనించాలి

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: నేటి విద్యార్థులు స్వచ్ఛత దిశగా పయనించి, భావితరాలకు ఆదర్శప్రాయం కావాలని తిరువూరు ఆర్డీవో డా.కె. మాధురి సూచించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులచే స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి, మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి పచ్చదనం పెంపొందించేందుకు ముందుండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి సాధుపాటి నాగమల్లేశ్వరి, ఎంపీడీవో సిహెచ్.ప్రసాద్, తహశీల్దారు కె.లక్ష్మీకళ్యాణి, హెచ్ఎం శోభాలత, రెవిన్యూ, మండలపరిషత్తు, వైద్యారోగ్య, పంచాయితీ సిబ్బంది, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: పశ్చిమ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యక్షంగా పర్యటించి పరిశీలించారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, ఎట్టి పరిస్థితుల్లోనూ నాసిరకం పనులు అనుమతించబోమని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో కూడిన మురుగు కాల్వలు, రహదారులు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఏటి అగ్రహారం 4వ, 5వ లైన్ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మురుగు సమస్యలను ప్రత్యక్షంగా గమనించి, శాశ్వత పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీ, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి డివిజన్‌లో నాణ్యమైన రహదారులు, శాశ్వత మురుగు వ్యవస్థలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే తన లక్ష్యమని అన్నారు. ప్రజా ఆరోగ్యానికి శానిటేషన్ కీలకమని, చెత్త సకాలంలో తొలగింపుతో పాటు కాల్వలు క్రమం తప్పకుండా శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

ఆదర్శప్రాయులు ప్రకాశం పంతులు

విశాలాంధ్ర-దుగ్గిరాల: టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శప్రాయుడని వైఎస్సార్ సీపీ మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ సుభాని పేర్కొన్నారు. శనివారం దుగ్గిరాల జెండా చెట్టు సెంటర్ వద్ద ఆయన జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుభానీ మాట్లాడుతూ.. నిరుపేదకుటుంబంలో జన్మించిన ప్రకాశం పంతులు మద్రాసు రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా 13 నెలల పాటుపని చేయడం గర్వకారణమన్నారు. మద్రాసులో సైమన్ కమిషన్ను వ్యతిరేకంగా పోరాటం చేసి తుపాకీకి ఎదురుగా నిలబడి.. కాల్చండి అంటూ తన గుండెను చూపించిన ధైర్యశాలి అని కొనియాడారు. రాష్ట్రానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఒంగోలుజిల్లాకు ప్రకాశం జిల్లాగా పేరు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో షేక్ రఫీద్, షేక్ జిలానీ, షేక్ మస్తాన్ వలీ, షేక్ జాన్ సైదా, కాకా వేంకటేశ్వర్లు , కుర్ర రంగారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ నిర్మాణానికి మాదల చైతన్య రూ.కోటి విరాళం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కాకతీయ కన్వెన్షన్ సొసైటీ ఆధ్వర్యంలో నడపబడుతున్న కాకతీయ విద్యాలయం, వారి సంఘ పేద విద్యార్థులకు..(బాలుర)వారి తల్లిదండ్రులతో శనివారం ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జనచైతన్య ప్రాపర్టీస్ అధినేత, టీడీపీ యువ నాయకులు మాదల చైతన్య ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదల చైతన్య పేద విద్యార్థులకు (బాలుర) వసతి గృహ నిర్మాణానికి కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు. దీంతో గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని), పయనీర్ సంస్థ అధినేత చుక్కపల్లి రమేష్‌లు మాదల చైతన్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ కన్వెన్షన్ సొసైటీ అధ్యక్షులు రమేష్ కృష్ణచంద్ర, కార్యదర్శి ఘంటా పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెదకాకాని : తక్కెళ్ళ పాడు గ్రామంలో ఆదివారం ఎన్టీ రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగునని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా టీడీపీ నాయకులు నందిపాటి బసవయ్య, టీడీపీ మండల అధ్యక్షులు పలివెల మురళీకృష్ణ శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. తక్కెళ్ళపాడు గ్రామం మొదటి నుంచి తెలుగుదేశం పార్టీకి కంచుకోటని ఇప్పటికే ఈ గ్రామంలో ఐదు ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రస్తుత విగ్రహం శ్రీకృష్ణుని రూపంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రభుత్వంలోని పలువురు మంత్రులు, జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు వస్తున్నారని కావున మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విగ్రహావిష్కరణ అనంతరం 8 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో తక్కెళ్ళపాడు సొసైటీ అధ్యక్షులు జాలాది బ్రహ్మయ్య, రాజేష్, సంపత్, నందిపాటి ప్రసాద్, మల్లికార్జునరావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబంలో సుఖ శాంతులు: డాక్టర్ రాజకుమారి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సుఖ శాంతులతో వర్ధిల్లుతుందని అహల్య ట్రస్ట్ డైరెక్టర్, ప్రముఖ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ కాలేజీ విద్యార్థినీలకు, మహిళా ఉపాధ్యాయినీలకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజకుమారి బ్రెస్ట్ క్యాన్సర్ నివారణ..మెన్‌స్ట్రువల్ సైకిల్ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు గురించి విద్యార్థినీలకు వివరించారు. అనంతరం డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ మహిళలు క్రమం తప్పకుండా బ్రెస్ట్ సెల్ఫ్ ఎగ్జామినేషన్ చేసుకోవాలన్నారు. మెన్‌స్ట్రువల్ సైకిల్ సమయంలో శుభ్రత, సమతుల ఆహారం, మానసిక ప్రశాంతత తప్పనిసరి అని, వ్యాయామం, రెగ్యులర్ హెల్త్ చెకప్స్ ద్వారా అనేక వ్యాధులను ముందుగానే నివారించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

సురవరం మృతికి వల్లంరెడ్డి సంతాపం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాకు జాతీయ ప్రధాన కార్యదర్శిగా, రెండుసార్లు లోక్‌సభ సభ్యునిగా అవిరళ కృషి చేసిన సురవరం సుధాకర రెడ్డి మృతి పట్ల జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. 1942 మార్చి 25న మహబూబ్ నగర్ జిల్లాలోని కొండ్రావు పల్లి గ్రామంలో జన్మించిన సురవరం సుధాకర రెడ్డి విద్యార్థి ఉద్యమ అగ్ర నేతగా, యువజన నేతగా జాతీయ స్థాయిలో కృషి చేసిన మహనీయులు అని కొనియాడారు. దేశవ్యాప్తంగా పేదలు, రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం కృషి చేసి తన 83వ ఏట అనారోగ్యంతో మరణించారని, సీపీఐలో అంచెలంచెలుగా ఎదిగి జాతీయ ప్రధాన కార్యదర్శిగా 7 సంవత్సరాల పాటు సేవలందించారని ప్రశంసించారు. తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి సురవరం సుధాకర రెడ్డికి బాబాయి కావడం విశేషం. వారి వారసత్వ లక్షణాలను పునికిపుచ్చుకుని గొప్ప స్థాయికి ఎదిగినారన్నారు. దేశహితం కాంక్షించి దేశ రాజకీయాలలో క్రియాశీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఎర్రజెండా చేతపట్టి జీవితాంతం ఉద్యమించిన మహనేతను దేశం కోల్పోయిందని వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు.

శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-మంగళగిరి : శివాలయం వద్ద గల శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానం మెట్ల మార్గం దగ్గర అన్నదాన మహోత్సవం కార్యక్రమం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల సందడితో పాటు భక్తి కాంతులు వెదజల్లుతూ శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం శనివారం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావుతో పాటు జనసేన నియోజకవర్గ నాయకులు తిరుమలశెట్టి కొండలరావు స్వయంగా అన్నప్రసాద వితరణలో పాల్గొని భక్తులకు భోజనాన్ని అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఎటువంటి విరామం లేకుండా ప్రతి నెల అమావాస్య సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం వెనుక 40 మంది దాతల సహకారం ఉందని, వారి ఉదారత వల్లే భక్తులకు ఆహారం అందించే అవకాశం లభిస్తోందని అన్నారు. భక్తుల సేవే పరమార్థం. ఆకలితో వచ్చే వారు అన్నప్రసాదం స్వీకరించి సంతృప్తిగా వెళ్లడం మాకు ఆనందాన్నిస్తుందని సాంబశివరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పుప్పాల కోటేశ్వరరావు, కర్నాటి శివ సత్యనారాయణ, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, పంచల శివన్నారాయణ, చాగంటిపాటి దేవవర్ధన్, ఖడ్గ శ్రీనివాసరావు, పందేటి శ్రీను, కళ్ళం శివ సాంబిరెడ్డి, ఆలూరి ఉమామహేశ్వరరావు, ప్రసాద్, భోజనపల్లి తాండవ, చీదేళ్ల వాసు, కోదాడ శ్రీనివాసరావు, చిరుమామిళ్ల రంగారావు, యేల్చూరి వెంకట సుబ్బారామిరెడ్డి, వీర రాఘవులు, సంధ్యాల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

హాస్పిటల్స్‌ను సందర్శించిన డీఎంహెచ్‌ఓ

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డిఎంహెచ్‌ఓ)అధికారి డాక్టర్ కె విజయలక్ష్మి గుంటూరు పట్టణంలోని శ్రేష్ట హాస్పిటల్..విజయాస్ కోస్టల్ కేర్ ఆసుపత్రులను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్పటల్స్ వారు నిర్వహిస్తున్న రిజిస్టర్‌లను పరిశీలించి అల్లోపతి ఆక్ట్ ప్రకారం వారు పాటించవలసిన ప్రమాణాలను తెలియజేశారు. క్రొత్తగా ఏర్పాటు చేసిన విజయాస్ కోస్టల్ కేర్ ఆసుపత్రిలో ప్రైస్ బోర్డు డిస్‌ప్లే చేయమని ఆదేశించారు. అలాగే వెంటిలేషన్ సదుపాయాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పరిశీలనలో హాస్పిటల్ నిర్మాణం

విశాలాంధ్ర-పెదనందిపాడు : స్థానిక ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల నూతన నిర్మాణానికి సంబంధించిన దస్త్రం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు డీఐఓ(జిల్లా వ్యాధినిరోధక అధికారి) ఎ.శ్రావణ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మండలంలో ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్న ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని అబ్బినేనిగుంటపాలెం, వరగాని తదితర గ్రామాలలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక ప్రాథమిక వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని, తల్లి, బిడ్డల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తుందని చెప్పారు.

పొన్నూరులో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర

విశాలాంధ్ర-పొన్నూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఏడాది జనవరి 18న ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభించారు. తొలుత పట్టణ ప్రజలతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ర్యాలీ నిర్వహించారు. స్వయంగా ప్రజలతో కలిసి డ్రైనేజీ కాలువల్లో వ్యర్థాలను తొలగించారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి ఆరోగ్యవంతంగా ఉండాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమం విశిష్టతను ప్రజలకు వివరించారు. ప్రతిఒక్కరూ పొన్నూరు పట్టణాన్ని స్వచ్ఛ పొన్నూరుగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితోపాటు కూటమి శ్రేణులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకులు నరసింహారావు వర్ధంతి సభ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ గౌరవాధ్యక్షులు, విశ్రాంత అధ్యాపకులు, కీర్తిశేషులు ఎన్.వి నరసింహారావు ప్రథమ వర్ధంతి సభ శనివారం స్థానిక కలెక్టరేట్ కాంపౌండ్ కార్యాలయంలో జరిగింది. ఈ వర్ధంతి సభలో గుంటూరు జిల్లా శాఖ సంఘ అధ్యక్షులు సిహెచ్. వెంకటేశ్వర్లు, సీనియర్ సభ్యులు వెంకట్ రెడ్డి, రాష్ట్ర సంఘ కోశాధికారి పి.నాగరాజు, సంఘ కోశాధికారి లూర్దు రెడ్డి, సంఘ పల్నాడు జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ సుధాకర్ బాబు, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, సంఘ గౌరవ సభ్యులు పాల్గొని నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నరసింహారావు సంఘ కార్యక్రమాలకు అనేక విధాలుగా సలహా సహకారములు అందించి సంఘము ప్రారంభం నుండి గుంటూరు శాఖ గౌరవాధ్యక్షులుగా ఉన్నారని గుర్తు చేసుకున్నారు. గుంటూరు జిల్లా రేపూడి గ్రామంలో పుట్టిన నరసింహారావు చిన్న తనం నుండి బాలమిత్ర సంఘం నుండి మొదలై ఎన్‌జీఓ సంఘం, జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షునిగా, ఉద్యోగ క్రాంతి (ఏ.పి.ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షునిగా) ఏ.పి.సి.ఎల్.సి జిల్లా అధ్యక్షునిగా అనేక ఇతర సంఘాల్లో ప్రజాసంఘాలతో కలిసి ప్రజా పోరాటాలలో పాల్గొంటూ పెన్షన్ సంఘాలలో తన వంతు పోషించారన్నారు.

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - వినుకొండ : ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను ఈనెల 30, 31 తారీకు గుంటూరు నగరంలోని వెంకటేశ్వర విజ్ఞానం మందిర్ లో జరగనున్న రాష్ట్ర మహాసభలకు న్యాయవాదులు హాజరు కావలసినదిగా వినుకొండ న్యాయవాద సంఘం అధ్యక్షులు మీసాల. శ్రీనివాసరావు, కార్యదర్శి పఠాన్. గౌస్ మొహిద్దీన్ ఖాన్, ఉపాధ్యక్షులు పివి. రమణ రెడ్డి, సహాయ కార్యదర్శి నీలం. శేఖర్ బాబు, కోశాధికారి వరగాని శివ శంకర్ బాబు పిలుపునిచ్చారు. అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు ముట్టూరి ఎలీషా బాబు, భీమవరపు శ్రీనివాసులు, బి. రామ్మోహన్, మారెళ్ళ సీతారామాంజనేయులు, రెడ్డిబోయిన బాబు ,దుగ్గిపోగు విజయ్, శివా నాయక్, లా. స్టూడెంట్ మస్తాన్ వలి, పాల్గొని (ఐ ఎల్ ఏ) వాల్ పోస్టర్ల(గోడ ప్రతులు) ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పిజె . లూకా మాట్లాడుతూ. దేశ ప్రజలందరికీ సకాలంలో సత్వర న్యాయాన్ని అందరికీ అందించడం లక్ష్యంగా ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ పనిచేస్తుందని అన్నారు.

కరెంటు తీగలు తొలగించాలని రైతుల ఆందోళన

విశాలాంధ్ర - వినుకొండ : వితంరాజు పల్లి, బ్రాహ్మణపల్లి ఎన్ఎస్పి కాలువపై కరెంటు స్తంభం తీగలు ఉండటం వలన ప్రమాదం ఉన్నదని అడ్డంగా ఉన్న తీగలు తొలగించాలని రైతులు, ప్రజా సంఘాల నాయకులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గతంలో విద్యుత్ అధికారులకు అర్జీ ఇస్తే వచ్చి పరిశీలించి స్తంభం పడిపోకుండా రిపేర్ చేయిస్తే తీగలు తొలగిస్తామని హామీ ఇచ్చారు. స్తంభం చుట్టుప్రక్కల రిపేర్ చేయించిన విద్యుత్ అధికారులు స్పందించలేదని, స్థానిక తహసిల్దార్‌కు గ్రీవెన్స్ సెల్ మెమోరాండం ఇవ్వటం జరిగిందని, తక్షణమే రోడ్డుపై అడ్డంగా ఉన్న కరెంటు తీగలు తొలగించి ప్రమాదాలు నివారించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడియం రాష్ట్ర నాయకులు, వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, పగడాల చిన్నకోటిరెడ్డి, కంఠా రంగారావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై తనిఖీలు

విశాలాంధ్ర-కారంపూడి: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు సరఫరా అవుతున్నాయా లేదా అన్న దానిపై అధికారులు కఠినచర్యలు చేపట్టారు. శనివారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలపై తహశీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఏవో పొట్ల నరసింహారావు, ఎస్ఐ ఎం వాసు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లు, ఈ పోస్ బ్యాలెన్స్‌లు పరిశీలించి నిల్వలు సరిపోలుతున్నాయా లేదా అని పరిశీలించారు.ఎరువుల దుకాణదారులు లైసెన్స్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ఎరువులు, పురుమందులు అధికధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు సరైన ధరలకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించాలనే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు,

ప్రమాణ స్వీకారానికి తరలిరండి

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఈ నెల 24వ తేదీన క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ డైరెక్టర్ల ప్రమాణస్వీకారం ఆదివారం జరుగుతుందని మండల టీడీపీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. పెదకూరపాడు మండలానికి 4 డైరెక్టర్ పదవులు అందించిన భాష్యం ప్రవీణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ప్రమాణస్వీకారానికి పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా టీడీపీ కార్యదర్శి రమేష్ గోపాలరావు, గల్లా బాబురావు, పి.బాలయ్య, వడ్లమూడి అప్పారావు, సరుకుడు గోపి, గంగినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పెను సవాల్‌గా వైసీపీ పేర్చిన చెత్త: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : రాష్ట్రంలో అయిదేళ్ల వైకాపా పాలనలో వదిలిపోయిన చెత్త, వ్యర్థాలు ఇప్పటికీ సవాల్‌గా మిగలడం వారు చేసిన నష్టానికి, అరాచక, అడ్డగోలు పాలనకు నిదర్శనమని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. చెత్త పన్ను వేసింది కాక మొత్తం 87 లక్షల టన్నుల చెత్తను ఎక్కడికక్కడ కొండల్లా వదిలేసి పోయారని, ఏడాదిగా వాటికి పరిష్కారం చూపడానికే శ్రమించాల్సి వస్తోందన్నారు. ఉన్న ఆ చెత్త చాలదన్నట్లు నిత్యం జగన్, వైకాపానేతలు, కొన్ని దారి తప్పిన సోషల్ మీడియా ఛానెళ్లు మరింత చెత్త కుమ్మరిస్తూ, వాతావరణాన్ని, సమాజంలో సఖ్యతను, శాంతిభద్రతల్ని చెడగొట్టాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఐదేళ్ల విషప్రచారం, అసత్యాలను ప్రచారం చేసినందుకు ప్రజలు బుద్ధి చెప్పారని, అయినా వారిలో మార్పు రాలేదని ఇకనైనా తీరు మార్చు కోవాలని హితవు పలికారు. వినుకొండలో శనివారం స్వచ్ఛతా ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. నియోజకవర్గవ్యాప్తంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని, భాగస్వామ్యం అవుతున్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చెత్తాచె దారం రోడ్లపై కాక ఆ బుట్టల్లోనే వేయాలని కోరారు. డ్రైనేజీల్లో చెత్తాచెదార వేయకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డ్రైనేజీలతో పాటు ప్రతి వీధి, బజారును పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మన పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచు కుంటే ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధించుకోగలుగుతా మని వెల్లడించారు. ప్రతి మున్సిపాలి టీలో చెత్త నుంచి సంపద సృష్టించే వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్లు పెడుతున్నామన్న జీవీ భవిష్యత్ మండల కేంద్రాల్లోనూ వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. కౌన్సిలర్ షకీలా దస్తగిరి, కూటమి నేతలు పివి సురేష్ బాబు, సౌదాగర్ జానీ బాషా, గంధం కోటేశ్వరరావు, బొంకూరి రోశయ్య, మున్సిపల్ కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్, సానిటరీ అధికారి ఎస్‌కే ఇస్మాయిల్, కార్మికులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర-మాచర్ల: చట్టం న్యాయవ్యవస్థల పట్ల విద్యా ర్థులు అవగాహన పెంచుకోవాలని మండల లీగల్ సర్వీ సెస్ కమిటీ అధ్యక్షులు అద నపు జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్ శ్రీనివాస్ కళ్యాణం అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ వసతి గృహంలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినప్పటికి, ఇప్పటికీ సమాజంలో కుల వివక్షతకు చోటు ఉండటం దురదృష్టకరమన్నారు. అలాగే షెడ్యూల్ కులాలపై ఎవరైనా వివక్షతో దౌర్జన్యం చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో న్యాయవాది వరప్రసాద్, వార్డెన్ నూరుల్లా బేగ్, ఎన్.రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

మాన్‌సూన్ హైజినిక్‌పై అవగాహన

విశాలాంధ్ర-కారంపూడి: మండలంలో ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మాన్‌సూన్ హైజినిక్-సీజనల్ వ్యాధుల నివారణ, అవసర నీటి నిల్వల తొలగింపు ప్రధాన అంశంతో నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో వైద్య-ఆరోగ్య సిబ్బందితో కలిసి అవగాహన సదస్సులు చేపట్టారు. నరమాలపాడు గ్రామంలో జరిగిన సదస్సులో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, అతిసారం వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతి కుటుంబం తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఇండ్లలో అనవసరపు నీటి తొట్టెలు, గుంటలను తొలగించి శుభ్రత పాటించాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో సి హెచ్‌ఓ మల్లయ్య, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, మలేరియా సూపర్వైజర్ లాలు నాయక్, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగవైకల్య చిన్నారులకు అండగా ఉంటా : ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పుట్టుకతో వివిధ అంగవైకల్య సమస్యలతో బాధపడే చిన్నా రుల సంక్షేమంలో భాగంగా వారికి ఉచిత విద్యతో పాటు.. వైద్యసేవల్ని అందిస్తున్న కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల కృషికి తమ వంతు సహాయ సహకారాలు అందించడం మనందరి బాధ్యతని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని 7వ వార్డులో మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ పాఠశాల్లో దివ్యాంగ చిన్నారుల కోసం పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష సహిత విద్యావిధానంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేకవైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ సమాధ్ ఖాన్, మద్దుమాల రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్, ఎల్‌వోసీ చెక్కులు అందజేత

వివిధ అనారోగ్య సమస్యలు.. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ వైద్య చికిత్సలకు అవసరమైన ఆర్థిక సాయం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల్ని, ఎల్‌వోసీలను ప్రత్తిపాటి స్వయంగా వారికి అందించారు. శనివారం తన నివాసంలో 30 మంది లబ్ధిదారులకు రూ..13.65 లక్షల విలువైన చెక్కులు, మరో ముగ్గురికి రూ.5.లక్షల విలువైన ఎల్‌వోసీలను ఆయన అందజేశారు

రూ.5 లక్షలతో ట్యాంకు మరమ్మతులు

విశాలాంధ్ర-యద్దనపూడి : మండలంలోని కోట గ్రామంలో రక్షిత నీటి పథకం ట్యాంకుకు నూతన ఇనుప(జింక్) మెట్లు, అదే పంచాయతీ పరిధిలోని సంతపేటలో నీటి అవసరాల కోసం బోరు, సబ్మెర్సిబుల్ మోటర్, పైప్ లైన్ ఏర్పాటు చేసి శనివారం ప్రారంభించారు.

మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు వెచ్చించినట్లు కోట సర్పంచ్ హఫీజ్ బేగ్ తెలిపారు. గతంలో ఓవర్ హెడ్ ట్యాంకుకు ఉన్న సిమెంట్ మెట్లు ధ్వంసం కావటంతో ఐదేళ్లుగా ఓవర్ హెడ్ ట్యాంక్ శుభ్రతకు నోచుకోకపోవటంతో ట్యాంక్‌లోని నీరు కలుషితమైంది. నూతనంగా మెట్లు నిర్మించడంతో ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేసే సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని సర్పంచ్ తెలిపారు.

సబ్సిడీ ఎరువుల అక్రమాల నియంత్రణకు తనిఖీ బృందాలు : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: సబ్సిడీలో రైతులకు అందిస్తున్న ఎరువుల అక్రమ నిల్వలు, క్రయ విక్రయాలు, పక్కదారి పట్టడం వంటి కార్యక్రమాలను నియంత్రించేందుకు మండల స్థాయిలో తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తూ కలెక్టర్ అరుణ్ బాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎరువుల అక్రమాలను అరికట్టేందుకు తనిఖీ బృందాలు రోజువారీగా మెరుపు దాడులు నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ బృందాలు పర్యవేక్షిస్తాయని అన్నారు. తహసీల్దార్, ఎస్సై, మండల వ్యవసాయ అధికారి మండల స్థాయి తనిఖీ బృందంలో సభ్యులుగా వ్యవహరించనున్నారు. మండల స్థాయి తనిఖీ బృందాల మండలాల్లోని అన్ని ఎరువుల డీలర్ అవుట్‌లెట్‌లను తనిఖీ చేయాలి. ఈపోస్ పరికర బ్యాలెన్స్‌లను భౌతిక స్టాక్‌తో సరిపోల్చాలి, రెండూ సరిపోలుతున్నాయని నిర్ధారించుకోవాలి. నిర్ధారణ కోసం ఈపాస్‌లో నమోదు చేయబడిన రిటైలర్ల స్టాక్ రసీదులు మరియు అంగీకార పత్రాలను నిశితంగా పరిశీలించాలి. ఏవైనా ఉల్లంఘనలు గుర్తిస్తే సంబంధిత డీలర్లు/పరిశ్రమలపై ఎఫ్‌సిఒ 1985 మరియు ఈసీ చట్టం, 1955 ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలి. తదుపరి అవసరమైన చర్యల కోసం డీఈవో పల్నాడుకు తనిఖీ చర్యల నివేదికలను ఆలస్యం చేయకుండా సమర్పించాలి. యూరియా, టెక్నికల్ గ్రేడ్ యూరియా సరఫరా మరియు స్టాక్ స్థానాన్ని పర్యవేక్షించాలి. అర్హులైన రైతులకు సమానంగా మరియు అవసరాలకు తగ్గట్టు పంపిణీని నిర్ధారించాలి. యూరియా అక్రమ రవాణా లేదా నిల్వను నిరోధించాలి. రైతుల నుండి ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించాలి. యూరియాను ముడిసరుకుగా ఉపయోగించే అన్ని పరిశ్రమలను, సరిహద్దుల మీదుగా కదలికలను బృందాలు తనిఖీ చేసి, తక్షణమే దాడి చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు.

నిబద్ధతకు దక్కిన గౌరవం

- పార్టీ పేరును ఇంటిపేరుగా మార్చుకున్న టీడీపీ కరిముల్లా
- మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్‌గా నేడు ప్రమాణస్వీకారం
- పట్టణంలో భారీ ర్యాలీ.. తరలిరానున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: టీడీపీ ఆవిర్భావం నుంచి కొనసాగిన ప్రయాణం ఈయనది. పార్టీ పేరునే ఇంటిపేరుగా మార్చుకున్న నిబద్ధతకు దక్కిన అవకాశం ఇది. చిలకలూరిపేట నియోజక వర్గంలో టీడీపీ కరిముల్లా అంటే తెలియని వారు ఉండరు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా నేటి తరం యువతకు ముందుండి నడిపించే కరిముల్లాకు టీడీపీ అధిష్ఠానం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పదవి కేటాయించింది. ఆదివారం చిలకలూరిపేట నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా షేక్ కరిముల్లా, ఆయనతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేయనున్నారు. పట్టణంలోని పాత ఐదో వార్డు పార్టీ అధ్యక్షుడిగా మొదలైన ఆయన ప్రస్థానం రాష్ట్ర స్థాయి కార్యనిర్వాహక కార్యదర్శి వరకు కొనసాగింది. చిలకలూరిపేట పట్టణ అధ్యక్షుడిగా 10 సంవత్సరాల పాటు కొనసాగారు. అక్కడి నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శిగా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా అత్యధిక కాలం సేవలు అందించారు. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శిగా కొనసాగుతున్నారు. రాజకీయ జీవితంలో మూడు తరాలను చూసిన ఏకైక నాయకుడు కరిముల్లా అనే చెప్పవచ్చు. పార్టీ అధికారంలో ఉన్నా. ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ అధిష్ఠానం పిలుపు ఇస్తే ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేసే నిబద్ధత ఈయన సొంతం. గతంలో గుంటూరు ఎంపీ స్వర్గీయ లాల్ జాన్‌బాషా గెలుపులోనూ, అనంతరం ఎంపీ నిధు లను చిలకలూరిపేట నియోజకవర్గంలో అత్యధికంగా రాబట్టి నియోజకవర్గ అభి వృద్ధిలో కీలక పాత్ర పోషించారు. ఎన్ని కలు ఏవైనా పార్టీలో కరిముల్లా కీలకంగా వ్యవహరిస్తారు. గత నుండి చిలక లూరిపేట నియోజ కవర్గంపై ఆయనకు ఉన్న పట్టు, ఆయా ప్రాంతాల వారిగా పార్టీకి ఉన్న బలం, బలహీనతలను అంచనా వేసి ఆయా ఎన్నికల్లో ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరిస్తుంటారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గెలుపులోనూ కరిముల్లా పాత్ర కీలకం. అందుకే పార్టీలో పెద్దగా వ్యవహరిస్తున్న కరిముల్లాకు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవి రావడానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేసిన కృషిని పలువురు అభినందిస్తున్నారు. చిలకలూరిపేట చరిత్రలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని రెండు సార్లు కూడా ముస్లిం మైనార్టీలకు కట్టబెట్టి ముస్లింల పట్ల టీడీపీ చిత్తశుద్ధిని నిరూపించుకుంది. గతంలోనూ ఎస్ఎస్ సుభాని, ప్రస్తుతం కరిముల్లాకు టీడీపీయే చైర్మన్ పదవిని కేటాయించటం విశేషం.

నేడు ప్రమాణస్వీకార మహోత్సవం..,

చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా షేక్ కరిముల్లా, వైస్ చైర్మన్‌గా పిల్లి కోటేశ్వరావుతో పాటు కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు గుర్రాల చావిడి నుంచి ర్యాలీగా చౌత్రసెంటర్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, ఎన్ ఆర్‌టీ సెంటర్ మీదుగా మార్కెట్‌యార్డుకు చేరుకుంటారు. ఈ సభకు మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, పార్లమెంటు సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడా అరవింద్ బాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ హాజరుకానున్నారు.

సీఎంను కలిసిన ఐఎంఏ రాష్ట్ర బృందం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగాలలో సేవల్ని మరింత విస్తృతపరచడంలోనూ, ప్రజల కు మెరుగైన వైద్య సేవలు అందించడంలోనూ రాష్ట్ర ఐఎంఏ ఎల్లప్పుడు ప్రభుత్వానికి సహకరిస్తుందని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తెలిపారు. శనివారం రాష్ట్రంలో ఐఎంఏలో 25 వేల మంది వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రికి వివరించి, మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా నందకిషోర్ మాట్లాడుతూ ముఖ్యంగా వైద్యులపై దాడుల విషయంలో ప్రస్తుతం ఉన్న చట్టంలో మరికొన్ని మార్పులు చేయాలని, ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ల విషయంలో అగ్నిమాక శాఖ నిబంధనలను కొన్నింటిని సవరించాలని కోరారు. అలానే 10 పడకల లోపు ఆసుపత్రుల విషయంలో మరిన్ని సడలింపులు అవసరమని, ఫైర్ ఎన్ఓసి రెన్యువల్ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పెట్టాలని ముఖ్యమంత్రికి వివరించారు. ఐఎంఏ వైద్య బృందం వివరించిన సమస్యలను విన్న చంద్రబాబు నాయుడు సమస్యలన్నిటిని తప్పక పరిశీలించి సత్వర చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని డాక్టర్ నందకిషోర్ తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఐఎంఏ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, డాక్టర్ ఎంజెసి నాయుడు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వ విద్యాలయం పాలక కమిటీ సభ్యులు డాక్టర్ ఎస్.సురేష్ తదితరులు ఉన్నారు.

చవితి పందిళ్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి: కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: ఈ నెల 27న వినాయక చవితి పండగ సందర్భంగా వినాయక ఉత్సవ నిర్వాహకులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సింగల్ విండో పద్ధతిలో తప్పకుండా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని యస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో వినాయక చవితి పండుగ ఉత్సవాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత, భక్తి పూర్వక వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్దేశిత నిమజ్జన ప్రదేశాలలో ప్రణాళిక ప్రకారం విగ్రహ నిమజ్జనం జరిగేలా చూడాలన్నారు. నిమజ్జన ప్రదేశాలలో గజ ఈతగాళ్ళను, అవసరమైన చోట బోట్లను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. నిమజ్జన ప్రదేశంలో పబ్లిక్ అనౌన్స్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. అవాంచనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్సవ నిర్వాహకులలో ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధముగా అవగాహన కల్పించాలన్నారు. మండపాల అనుమతుల కోసం పోలీసు శాఖ నిర్వహిస్తున్న వెబ్ సైట్ ద్వారా అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 271 మంది దరఖాస్తు చేసుకొన్నారని తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాల విషయంలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా రెవిన్యూ అధికారి మురళి, గురజాల ఆర్డీవో మురళీ కృష్ణ, కమిషనర్లు, అధికారులు పాల్గొనారు.

జనరల్ నోటీసు

మహరాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)వారి కోర్టు: గురజాల

I.P No: 35 / 2025

బిట్వీన్:
వేల్పుల విజయ సాగర్ ...పిటీషనరు
మరియు
గన్నెపోగు కరుణ & 17 ఇతరులు ...రెస్పాండెంట్స్

1)గన్నెపోగు కరుణ, భర్త. వెంకయ్య,R/o. చర్చ దగ్గర, వేమవరం గ్రామం,మాచవరం(మం), పల్నాడు జిల్లా, 2)బొల్లాపల్లి రామకోటయ్య,తండ్రి.లక్ష్మయ్య,R/o.పిడుగురాళ్ల(గ్రా&మం), పల్నాడు జిల్లా, 3)అల్లమూరి సాయిదాబి భర్త.సైద, R/o.4/7 తుమ్మల చెరువు గ్రామం, దాచేపల్లి(మం), పల్నాడుజిల్లా,4)సయ్యద్ ఫాతిమా, తండ్రి.బాషా, R/o.సున్నా బట్టీ వద్ద పిడుగురాళ్ల(గ్రా&మం), పల్నాడుజిల్లా, 5)దూదేకుల చిన్న సైదులు, తండ్రి. వెంకటరెడ్డి,R/o.6-12, జూలకల్లు గ్రామం, పిడుగురాళ్ల (మం), పల్నాడుజిల్లా,6)నూరు బాషా చిన్నా మీరబ్బీ, భర్త.సైద,R/o.18-1022, లెనిన్‌నగర్,పిడుగురాళ్ల(గ్రా&మం), పల్నాడు జిల్లా,7) ఒంట్లుపల్లి శైలజా,భర్త.పవన్,R/o.18-1992, లెనిన్‌నగర్, పిడుగురాళ్ల (గ్రా&మం), పల్నాడు జిల్లా, 8)చొప్పర శ్రీను, తండ్రి. కోటయ్య, R/o.10-1098,లెనిన్‌నగర్,పిడుగురాళ్ల(గ్రా&మం), పల్నాడు జిల్లా,9)చాకల సామ్రాజ్యం,R/o.18-176,లెనిన్‌నగర్, పిడుగు రాళ్ల(గ్రా&మం),పల్నాడుజిల్లా,10)వేమపాటి రామారావు, తండ్రి.ఆదినారాయణ,R/o.నియర్ జయలక్ష్మి సినిమాహాల్(గ్రా&మం),పల్నాడుజిల్లా,11)దూదేకుల హసీనమ్మ, భర్త.మస్తాన్, 12)లింగాల రాణి, భర్త.నాగేశ్వరరావు, 13)రామ పార్టీ అనంత లక్ష్మి,భర్త.సత్యానందం,14)వెన్యక నాగేశ్వరరావు, తండ్రి. ఓబులు, 15)తమ్మిశెట్టి లక్ష్మీ శిరీష, తండ్రి.కనకారావు, 16)షేక్ జానీ బేగం, భర్త.భాష, R-11 to R-16 నివాసం: లెనిన్ నగర్, పిడుగురాళ్ల (గ్రా&మం), పల్నాడుజిల్లా,17)తాళ్లపోగు పద్మ, భర.దానయ్య, R/o.క్రిష్టిన పాడు, పిడుగురాళ్ల(గ్రా&మం), పల్నాడుజిల్లా,18)ది అఫీషియల్ రిసీవర్, కోర్టు కాంప్లెక్స్, నగరంపాలెం, గుంటూరు.

పైన తెలిపిన పిటీషనరు, తనను ఇన్ సాల్వెంట్‌గా డిక్లేర్ చెయ్యమని పైన తెలిపిన కోర్టులో రెస్పాండెంట్స్ మీద ఇన్ సాల్వెంట్ పిటీషను దాఖలు చేసి ఉన్నారు. పైన తెలిపిన వారు కాకుండా ఇంకా ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల ది. **15-09-2025న ఉ.గం.10.30ని.**లకు పై కోర్టు వారి ముందు హాజరై మీకు గల ఆక్షపణలను తెలియపలచగలరు. లేని యెడల. మీపరోక్షమున పిటీషను తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం).
వాయిదా తేదీ :**15.09.2025**

కె. పూర్ణయ్య, పిటీషనరు తరపు అడ్వకేటు,
సత్తెనపల్లి, పల్నాడుజిల్లా. సెల్: 9951475771

మహారాజశ్రీ తెనాలి సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తెనాలి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 691/2024

బిట్వీన్ :
షేక్ జాకీర్ బాషా ....వాది
ఎదిరి
షేక్ అబ్దుల్ అజీజ్ @అబ్దుల్ అజీస్@అజీస్ ....ప్రతివాది

టు:
షేక్ అబ్దుల్ అజీజ్@అబ్దుల్ అజీస్@అజీస్ S/o. మోహ్మద్ షా, డోర్ నెం.16-40, రషీద్ కిరాణా షాపు వద్ద, తేలప్రోలు గ్రామము,తెనాలి(మం), గుంటూరు జిల్లా.

పై నంబరు దావాలో వాది మీపై ప్రోనోటు బాకీ వసూలు నిమిత్తము దావా దాఖలు చేసి ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసు అందచేయు నిమిత్తము పేపరు పబ్లికేషన్ కొరకు శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసి యున్నారు. కావున **ది.25-09-2025**వ తేదిన **ఉ॥గం॥10-30ని॥**లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కాని, ప్లీడరు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్న యేడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందు మూలకముగా మీకు తెలియ చేయటమైనది.

కె. హరికృష్ణ, వాది తరుపు న్యాయవాది
తెనాలి, సెల్: 94407 51659.

మహారాజశ్రీ తెనాలి సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తెనాలి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 691/2024 ఇన్ ఐ.ఎ.నెం.2359/2024

బిట్వీన్ :
షేక్ జాకీర్ బాషా ....వాది/పిటీషనర్
ఎదిరి
షేక్ అబ్దుల్ అజీజ్ @అబ్దుల్ అజీస్@అజీస్ ....ప్రతివాది/రెస్పాండెంట్

షేక్ అబ్దుల్ అజీజ్@అబ్దుల్ అజీస్@అజీస్ S/o. మోహ్మద్ షా, డోర్ నెం.16-40, రషీద్ కిరాణా షాపు వద్ద, తేలప్రోలు గ్రామము,తెనాలి(మం), గుంటూరు జిల్లా.

పై నంబరు దావాలో వాది మీపై ప్రోనోటు బాకీ వసూలు నిమిత్తము దావా దాఖలు చేసి మీ తాలుకూ దిగువ షెడ్యూలు ఆస్తి జప్తు కోరుచూ ప్రతివాది/రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసు అందచేయు నిమిత్తము పేపరు పబ్లికేషన్ కొరకు శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసి యున్నారు. కావున **ది.25-09-2025**వ తేదిన **ఉ॥గం॥10-30ని॥**లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కాని, ప్లీడరు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్న యేడల తెలుపు కొనవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందు మూలకముగా మీకు తెలియ చేయటమైనది.

షెడ్యూలు: గుంటూరు డి॥, తెనాలి వెస్ట్ సబ్ డి॥, తెనాలి(మం),తేలప్రోలు గ్రామ పంచాయితీ ఏరియా, కరెవరం గ్రామ డి.నెం.813లో చ॥గ॥ 169-7లు లేదా చ.మీ 141-89ర్లు స్థలమున్నూ, అందులో గల ఆర్.సి.సి. రూఫ్ దాబా ఇంటితో సహా, డోర్.నెం.16-40కు **హద్దులు: తూర్పు:** జాయింటు గల్లీ, **దక్షిణం:** పంచాయితీ బజారు, **పడమర:** షేక్ రషీద్ ఆస్తి హద్దు, **ఉత్తరం:** పఠాన్ కాజావలి ఆస్తి హద్దు.
వాయిదా తేది: **25-09-2025**

కె. హరికృష్ణ, వాది తరుపు న్యాయవాది
తెనాలి, సెల్: 94407 51659.

బహిరంగ ప్రకటన

మాక్లయింటు అయిన పిరమిల్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి సూచనల మేరకు యావన్మందికి తెలియజేయునదేమనగా, గుంటూరు సిటీ, ఏ.టి.అగ్రహారం మెయిన్‌రోడ్డు, డోర్.నెం.26-19-186 కాపురస్తులు షేక్ ఖాజాబీర్ గారు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని రిజిష్టరు దఖలు దస్తావేజు ద్వారా వారి తల్లిగారి వద్ద నుండి దఖలు పొందినారని అట్టి ఆస్తికి చెందిన లింకు దస్తావేజు నెం.10483/2014 పోయినదని దొరికియుండలేదని మా క్లయింటుకు తెలుపుచూ ఋణము కొరకు సంప్రదించియున్నారు. కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిగాని, పోయిన దస్తావేజు గురించి గాని ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, తనఖాలు, తాకట్లు వగైరాలు వున్నయెడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజులలోగా నాకు గాని, నాక్లయింటుకు గాని తెలియజేయగలరు. గడువులోగా ఎట్టి క్లయిములు రాని యెడల షెడ్యూలు ఆస్తిని నిష్పేచిఆస్తిగా భావించి మా క్లయింటు ఋణం మంజూరు చేయుదురని తెలియజేయడమైనది.

షెడ్యూలు:1వ అయిటం:గుంటూరు డి., నల్లపాడు సబ్ డి., యిలాకా గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాలో చేరిన నల్లపాడు గ్రామం తాలూకు డి.నెం.143/5రు యు.5-00 సెంట్లు మింజుమలె చ.గ.7310లు స్థలములో వాయ్యుమూలన చ.గ. 210లు ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు,తూర్పు:**యీ దిగువ 2వ అయిటం స్థలం హద్దు, అ.65-6 లు,**దక్షిణం:**బొబ్బా సునీత గారి స్థలం హద్దు అ.29లు,**పడమర:**నరశింహారావు గారి ఆస్తి హద్దు, అ.65లు,**ఉత్తరం:**అ.30లు వెడల్పు గల రోడ్డు హద్దు, అ.29లు.యీ హద్దుల మధ్య గల చ.గ.210లు ఖాళీ నివేశన స్థలమున్నూ.

2వ అయిటం:డిటో నెంబర్లు మింజుమలె జాయింటు నడవ దారి స్థలమునకు **హద్దులు.తూర్పు:**శ్రీరాములు గారి స్థలం హద్దు, అ.65-6 లు,**దక్షిణం:**స్మశానం గోడ హద్దు,అ.4లు,**పడమర:** పై తెల్పిన 1వ అయిటం స్థలం హద్దు,అ.65-6లు,**ఉత్తరం:**అ.30లు వెడల్పు గల రోడ్డు హద్దు,అ.4లు.యీ హద్దుల మధ్య గల చ.గ.25-11లు జాయింటు నడవ దారి స్థలములో 1/2వ వంతు చ.గ.14-55లు జాయింటు నడవ దారి స్థలము.

కె. ప్రమీల, అడ్వకేట్
చంద్రమౌళీనగర్, గుంటూరు. సెల్: 9985037449
గుంటూరు తేది: 22-08-2025

మహారాజ శ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.పి. నెం : 10/2025

బిట్వీన్,
తోటా నాగేశ్వరరావు ....పిటిషనర్.
వర్సెస్
జవిశెట్టి నాగేశ్వరరావు మరియు 35 మంది ....రెస్పాండెంట్స్.

To,
1.జవిశెట్టి నాగేశ్వరరావు తండ్రి.కోటయ్య, 2.గోపతి వెంకట రామయ్య, తండ్రి.బసవయ్య, 3.ముప్పవరపు ఆదిలక్ష్మి, భర్త. కృష్ణమూర్తి, 4. చిల్లం చర్ల రమాదేవి, భర్త. కృష్ణమూర్తి,5.జవిశెట్టి చిన్న శ్రీనివాసరావు తండ్రి.వెంకట నరసయ్య, నివాసం. గుండ్లపాడు గ్రామం,6. జవిశెట్టి శ్రీను తండ్రి. ఆదెయ్య,7. చింత బయన్న తండ్రి.నాగయ్య,8. సాని బ్రహ్మయ్య, తండ్రి . పేరయ్య,9. చింతా ఆదినారాయణ, తండ్రి రామయ్య,10. మహంకాళి శ్రీను, S/o.తండ్రి పేరు తెలియదు,11.బొడ్డు హనుమంతరావు,S/o. తండ్రి పేరు తెలియదు,12.చింతా నారాయణ, తండ్రి. సాంబయ్య, 13. కడియాల గురవయ్య, తండ్రి. నరసయ్య,14. తోట సాయమ్మ, భర్త.మల్లయ్య ,15. తోట వెంకటేశ్వర్లు, తండ్రి. పేరయ్య,16. బిట్టు నరసింహారావు, S/o.తండ్రి పేరు తెలియదు 17.కాకునూరి నారాయణ,తండ్రి.వెంకయ్య,18. తోటా మల్లమ్మ, భర్త. కొండలు,19.గజ్జల పెద్ద వెంకటేశ్వర్లు, S/o. తండ్రి పేరు తెలియదు,20.చింతా సీతమ్మ, భర్త.ఆదెయ్య, 21.చింతా సాలమ్మ, భర్త.మల్లయ్య, 22.ఉప్పుతోళ్ల శ్రీను, తండ్రి. నాగేశ్వరరావు, 23.చింతా రామయ్య, తండ్రి.ఆదెయ్య, 1 నుండి 23వరకు రెస్పాండెంట్స్ నివాసం: గుండ్లపాడు గ్రామం, వెల్దుర్తి (మం), పల్నాడు జిల్లా, 24. మొగుల్లూరి కోటేశ్వరరావు, తండ్రి. గురుపులు,25.సానికొమ్ము వెంకటేశ్వర రెడ్డి, S/o. తండ్రి పేరు తెలియదు,26.ఎస్. సైదారావు, S/o.తండ్రి పేరు తెలియదు,27. జిడ్డు ఈశ్వరరెడ్డి, S/o.తండ్రి పేరు తెలియదు(ఫెర్టిలైజర్ షాపు), 28.నారాయణ రెడ్డి,S/o.తండ్రి పేరు తెలియదు(ఫెర్టిలైజర్ షాప్), 29.చీదెళ్ళ బాల వెంకటేశ్వర్లు,S/o.తండ్రి పేరు తెలియదు (ఫెర్టిలైజర్ షాపు),30.గీతం శివారెడ్డి,S/o.తండ్రి పేరు తెలియదు (సాయి దుర్గా ఫెర్టిలైజర్ షాపు),31.పేరం వెంకట శివారెడ్డి, S/o. తండ్రి పేరు తెలియదు(ఫెర్టిలైజర్ షాపు),32.దుర్గంపూడి అప్పిరెడ్డి,S/o.తండ్రి పేరు తెలియదు (ఫెర్టిలైజర్ షాపు),33. షేక్ షకీర్, S/o. తండ్రి పేరు తెలియదు (అమరలింగేశ్వర ట్రేడర్స్), 24 నుండి 33 వరకు రెస్పాండెంట్స్ నివాసం: పత్తి ఫ్యాక్టరీ, శ్రీశైలం రోడ్, మాచర్ల టౌన్, మరియు మండలం, పల్నాడు జిల్లా, 34.పాశం రామిరెడ్డి,S/o.తండ్రి పేరు తెలియదు, టెక్స్మో మోటార్స్ అండ్ పంప్స్ డీలర్, HDFC బ్యాంక్ క్రింద శ్రీశైలం రోడ్డు, మాచర్ల టౌన్, పల్నాడు జిల్లా,35. కెనరా బ్యాంక్, మాచర్ల బ్రాంచ్, బస్టాండ్ దగ్గర మాచర్ల టౌన్ మరియు మండలం, పల్నాడు జిల్లా,36.అఫీషియల్ రిసీవర్, గుంటూరు జిల్లా కోర్టు ఆవరణ, గుంటూరు.

పై నెంబరు పిటిషన్‌లో పిటీషనర్ తనను ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై శ్రీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా రెస్పాండెంట్స్ అయిన మీకు నోటీస్‌లు జారీచేయు నిమిత్తం ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియచేయమని శ్రీ కోర్టు వారు **ది.29.08.2025**కు వాయిదా వేసియున్నారు.కావున సదరు వాయిదా తేదీన **ఉ॥గం॥10:30ని॥**లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు పిటీషన్‌ను విచారించి తీర్మానం చేయగలరని తెలియ పరచటమైనది.
వాయిదా తేది **ది.29/08/2025.**
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

యండపల్లి కృష్ణమూర్తి , పిటిషనర్ తరపు న్యాయవాది
మాచర్ల - 522426. సెల్ : 8374625898

రాష్ట్ర మహాసభలకు తరలివెళ్లిన సీపీఐ శ్రేణులు

విశాలాంధ్ర-నరసరావుపేట: ఒంగోలులో ప్రారంభమైన రాష్ట్ర మహాసభలకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావు పేట నుంచి సిపిఐ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. సందర్భంగా పార్టీ కార్యాలయం నుండి ఎర్ర జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా బయలుదేరారు.

కారంపూడి: ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర 28వ మహాసభకు మాచర్ల నియోజకవర్గం లోని అన్ని మండలాల నుండి నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, కార్మికులు, రైతుసంఘ నాయకులు భారీగా శనివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాచర్ల ఏరియా కార్యదర్శి మేక పోతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ సమహాసభలో రైతు,కూలీల సమస్యలు, ధరల పెరుగుదల,ఉద్యోగాల నియామకాలు, విద్య,ఆరోగ్య రంగాల్లో ప్రభుత్వ బాధ్యత తదితర అంశాలను ప్రస్తావించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం, యువతను పార్టీలోకి పెద్ద ఎత్తున తీసుకురావడం వంటి అంశాలను గురించి మాట్లాడతామన్నారు. మహాసభకు వెళ్లినవారిలో కారంపూడి మండల కార్యదర్శి షేక్ సైదా, సహాయ కార్యదర్శి మేకపోతు చినకోటిరెడ్డి, దుర్గి మండల కార్యదర్శి కాలా శివయ్య, రెంటచింతల మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు, మాచర్ల పట్టణ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు, ఏఐవైఎఫ్ నాయకులు రంగస్వామి, గాలం శ్రీనివాసరావు, శ్రీపతి సత్యనారాయణ, జైపూరి బ్రహ్మచారి, కన్నా నాగసుబ్బయ్య, సిహెచ్ పార్వతయ్య, వెంకటాచారి పాల్గొన్నారు.

దాచేపల్లి: సీపీఐ రాష్ట్ర మహా సభలు ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈ నెల 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు జరుగనున్నాయి. ఆ మహా సభల కోసం దాచేపల్లి నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పయనమయ్యారు. బస్సులు ఏర్పాటు చేసుకొని నారాయణపురంలోని సీపీఐ కల్యాణ మండపం నుంచి భారీగా తరలివెళ్లారు. వారిలో నేతలు, కార్యకర్తలు, మహిళలు, కార్మికులు, వ్యవసాయ కూలీలు ఉన్నారు.

తాడికొండ: సీపీఐ రాష్ట్ర మహా సభలకు తాడికొండ, తుళ్లూరు మండలాలకు చెందిన సిపిఐ నాయకుల వివిధ వాహనాలలో తరలి వెళ్లారు. సీపీఐ జిందాబాద్ అంటూ నినా దాలు చేశారు. పేదలకు అండ ఎర్ర జెండా అన్నారు. అనంతరం సిపిఐ జాతీయ నేత సురవర సుధాకర్ రెడ్డికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు పచ్చల సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, ఏఐటియుసి రాజధాని ప్రాంత కార్య దర్శి జి.వి.రాజు, సిపిఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, పార్టీ నాయకులు ఖమ్మంపాడు దేవుని దయ, గుర్రంకొండ సత్యానందం, రేపుడి శ్రీనివాసరావు, కోట భూపతి రావు, నూకవరపు వసంతరావు, రామినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి : సీపీఐ రాష్ట్ర మహాసభలకు మంగళగిరి నియోజకవర్గం నుంచి సీపీఐ నాయకులు భారీ ఎత్తున బయలుదేరారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పార్టీ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. మంగళగిరి పట్టణంలో పార్టీ కార్యాలయం వద్ద ప్రారంభమైన బస్సులలో సీపీఐ పట్టణ, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని నినాదాలతో ఒంగోలు మహాసభకు బయలుదేరి వెళ్లారు.

అస్తమించిన ఎర్ర సూర్యుడికి అశ్రునివాళి..

విశాలాంధ్ర-దాచేపల్లి: అస్తమించిన ఎర్ర సూర్యుడు సురవరం సుధాకరరెడ్డికి సీపీఐ దాచేపల్లి శాఖ నాయకులు శనివారం అశ్రు నివాళి అర్పించారు. పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్గొండ మాజీ ఎంపీ, ఉత్తమ పార్లమెంటేరియన్ గాను అటు పార్టీకి, ఇటు ప్రజలకు ఎన్నో సేవలు అందించారు. ఆయన తన నేత్రాలను కూడా హైదరాబాద్ లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి ఇచ్చారు. భౌతికకాయాన్ని కూడా గాంధీ మెడికల్ కాలేజీకి ఇవ్వనున్నారు. దాంతో ఎర్ర జెండా నీడలో ఒదిగిపోయిన ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. నారాయణపురంలోని సీపీఐ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ సభలో పార్టీ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, ఏఐటీయూసీ గురజాల నియోజకవర్గ అధ్యక్షుడు వేముల వెంకటరెడ్డి, పార్టీ మండల శాఖ కార్యదర్శి కొమెర వెంకట్రావు, సీనియరు నాయకులు బుర్రి కృష్ణారెడ్డి, తెలనాకుల సత్యనారాయణ, పత్తిపాటి నాగరాజు, ఎద్ల భాస్కర్, కోట్యూరి నరసింహారావు, మురికిపూడి సర్వయ్య, కోటేశ్వరరావు, రాజశేఖర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి : పట్టణంలో శనివారం సీపీఐ అగ్రనేత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి స్మృతిని సీపీఐ కార్యకర్తలు స్మరించుకున్నారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగంతో ప్రసంగించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి తన జీవితాన్ని సామాజిక న్యాయం, కార్మికుల హక్కులు, రైతుల సంక్షేమం కోసం అంకితం చేశారన్నారు. జాతీయ రాజకీయాల్లోనూ, రాష్ట్ర రాజకీయాల్లోనూ ఆయన చూపిన త్యాగపథం మాకు మార్గదర్శకం. విద్యార్థి దశ నుంచే ఆయన ప్రజాసేవలో అడుగుపెట్టి, చివరి వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం పోరాడారని చెప్పారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పెదకాకానిలో: సీపీఐ ముద్దుబిడ్డ సురవరం సుధాకర్ రెడ్డి మరణా నికి పెదకాకాని సీపీఐ శాఖ సంతాపం తెలియ జేసింది. ఈ సందర్భంగా పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు, విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావాల పట్ల ఆకర్షితుడై విద్యార్థి నాయకునిగా అనేక ఉద్యమాలకు సారథ్యం వహించారన్నారు. అఖిల భారత విద్యార్థి సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఎదిగి ఢిల్లీ కేంద్రంగా దేశంలో విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. అమరజీవి నల్లమల గిరిప్రసాద్ నిత్యత్వంలో సీపీఐ, ఎంసీపీఐ, లోక్‌దళ్, ఆర్‌పీఐ, జనతాదళ్, అన్నా టీడీపీ తదితర వామపక్ష ప్రజాస్వామిక పార్టీలతో ఏర్పడిన ఫ్రంట్‌కు కీలక సంధానకర్తగా ఉంటూ వివిధ జిల్లాలో జరిగిన అనేక సదస్సులకు హాజరై రాష్ట్ర ప్రజలలో చైతన్యాన్ని కలిగించారన్నారు. ఆయన నిరంతర అధ్యయనశీలి మార్క్సిస్ట్ మేధావి, మార్క్సిస్ట్ ఉపాధ్యాయుడు అలాంటి మేధావి మన మధ్య లేకపోవటం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పెదకాకాని గ్రామ సీపీఐ కార్యదర్శి పాటిబండ్ల దేవిడ్‌రాజు, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాసరావు, నారా ప్రసాదు, ఆర్.మోజెష్ బాబు, సిహెచ్ విజయలక్ష్మి, గౌస్, రామారావు, సత్యనారాయణ, బాసిదు, బుడే, వెంకటేశ్వరరావు, కాంతారావు, పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-నరసరావుపేట: సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సూరవరం సుధాకర్ రెడ్డి మృతి పార్టీకి, వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయనకు విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ యువజన విద్యార్థి రంగాలని ఒక తాటిపై నిలిపిన సురవరం సుధాకరరెడ్డి నేటి తరం యువతకు ఆదర్శప్రాయులన్నారు. రాష్ట్ర మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన మృతి వార్త పార్టీ శ్రేణులను కలచి వేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణ రాజు, రొద్ద అంజిరెడ్డి, ఉప్పలపాటి రంగయ్య, ఎస్ కె సైదా, దీనమ్మ, కొండమ్మ, కోయ శీను, రాజు, లలిత, బుజ్జి, అంజిరెడ్డి, వెంకయ్య, నరసరావుపేట నియోజకవ. మరియు పల్నాడు జిల్లా సమితి నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లి: సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మృతి బాధాకరమని మాజీ ఉప సర్పంచ్, మాజీ కౌన్సిలర్ కేళి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం వారి కార్యాలయంలో మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డికి హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానని అన్నారు. విద్యార్థి సంఘ నేత నుంచి రాజకీయ నేతగా జీవితాంతం ప్రజా ఉద్యమాలలో కొనసాగిన సురవరం సేవలు చిరస్మరణీయమని అన్నారు.

తాడేపల్లి: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటేరియన్ సురవరం సుధాకరరెడ్డి మరణం వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శులు తుడిమెల్ల వెంకటయ్య, ముసునూరు సుహాస్ అన్నారు. శనివారం తాడేపల్లి పార్టీ కార్యాలయంపై అలాగే పలు ప్రాంతాలలో ఉన్న పార్టీ స్థూపాల వద్ద జండాలను అవతానం చేసి ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురవరం సుధాకరరెడ్డి చక్కని వాగ్ధాటి, విషయ స్పష్టత కలిగిన వక్త ఒకతరం విద్యార్థి, యువజనులకు ఆయనో ఆకర్షణ. గుర్తింపు పొందిన పార్లమెంటేరియన్‌గా కీర్తి గడించారన్నారు. సురవరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తాడేపల్లి సీపీఐ పార్టీ తరపున తెలియజేస్తున్నామన్నారు.

తుళ్లూరులో: సీపీఐ అగ్ర నేత, మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ పార్ల మెంటేరియన్ సురవరం సుధాకర్ రెడ్డి అకాల మరణం పట్ల తాడికొండ నియోజకవర్గ సమితి తుళ్లూరు మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తాడికొండ నియోజకవర్గ సభ్యులు జీవీ రాజు మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుంచే ఉద్యమాలలో క్రియాశీలకంగా పాల్గొన్నారన్నారు. విద్యార్థి, యువజన, తెలంగాణ ఉద్యమాలతో పాటు భూసంస్కరణ పోరాటాలలోనూ ఆయన విశేషమైన పాత్ర పోషించారని చెప్పారు. ప్రజాస్వామ్య, లౌకిక వ్యవస్థ పరిరక్షణలో ఆయన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన వ్యక్తిత్వం నేటితరానికి మార్గదర్శకమని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, కంభంపాడు దేవుడి దయ, బెజవాడ యాకోబు, షేక్ నాగుల మీర, కొండపల్లి మాధవరావు, మరియదాసు, ఖమ్మంపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి : సీపీఐ అగ్రనాయకుడు సురవరం సుధాకర రెడ్డి మృతికి పట్టణానికి చెందిన ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు చెరుకుమల్లి సింగారావు శనివారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురుతుల్యులైన సుధాకరరెడ్డితో తనకున్న అనుబంధాన్ని సింగారావు తెలియజేశారు. అప్పట్లో తెనాలి, కొల్లిపర, మున్నంగి తదితర ప్రాంతాలలో జరిగిన సిపిఐ శిక్షణా తరగతులతో పాటు ఇంటూరులో జరిగిన కె.బి. కృష్ణ రచనల ఆవిష్కరణ కార్యక్రమాలలో సుధాకరరెడ్డి పాల్గొన్నారని సింగారావు తెలిపారు. వామపక్ష ఐక్యతకు కృషి చేసిన సుధాకరరెడ్డి మృతి తీరనిలోటు అని సింగారావు తెలియజేశారు.

అమరావతి : సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటు మాజీ సభ్యులు, విద్యార్థి యువజన సంఘాల అధినేత, కమ్యూనిస్టు ఎర్ర సూర్యుడు సురవరం సుధాకర్ రెడ్డి ఇక లేరన్న వార్తను జీర్ణించుకోలేకపోతున్నామని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ఏకైక లక్ష్యంగా భావించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ అన్నారు. అమరావతిలో శనివారం ఏర్పాటుచేసిన సురవరం సుధాకర్ రెడ్డి సంతాన సభలో రామకృష్ణ పాల్గొని ప్రసంగించారు.
ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎక్కడో మారుమూల ప్రాంతంలో జన్మించి దేశ విదేశాలలో కమ్యూనిస్టు ఎర్ర కెరటంలా ఉప్పొంగి పేద బడుగు బలహీన కార్మిక రైతాంగ వ్యవసాయ కార్మికుల హృదయాలలో స్థిరత్వాన్ని పదిలపరుచుకున్న మహోన్నత వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని, ఆయన మార్గంలో ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేసిన నాడే ఆయనకు నిజమైన నివాళులర్పించిన వారమౌతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు ముని, మంత్రాలు, సతీష్, వేదాంతం తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, ఉప సర్పంచ్ కుటుంబాలకు పరామర్శ

విశాలాంధ్ర-కాకుమాను : మండల పరిధిలోని చినలింగాయపాలెం గ్రామ సర్పంచ్ యోహాను(45), ఉప సర్పంచ్ గిరిబాబు(46)లు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంచలనం కలిగించింది. వారిరువురు కుటుంబాలను శనివారం జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు, జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట తహశీల్దార్ బి.వెంకటస్వామి, ఎంపీడీఓ యుగకీర్తి ఉన్నారు.

చైతన్య కళాశాల అధినేతకు మెమెంటో అందజేత

విశాలాంధ్ర - నందిగామ : సుజనా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో లెరన్ నెట్ మరియు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వారి సహకారంతో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఎలిజిబుల్స్ స్కిల్స్ మీద శిక్షణ అందించేందుకు దోహదపడిన చైతన్య విద్యాసంస్థల అధినేతకు కృతజ్ఞతలు తెలుపుతూ సుజనా ఫౌండేషన్ వారి మెమొంటో ను అందజేయడం జరిగినట్లు సుజనా నిర్వాహకులు కొంగర దుర్గాప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుజనా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుండి 27 సంవత్సరాలు పూర్తి అయిన డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉచిత శిక్షణతో పాటు ప్లేస్మెంట్ ఇప్పించటం జరుగుతుందని ఆయన తెలిపారు ఇప్పటికే కొందరు విద్యార్థులకు శిక్షణను అందించి ప్లేస్మెంట్స్ చూపించడం జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య కళాశాల అధినేత అమరనేని రమేష్ బాబు, లేరన్ నెట్ ప్రతినిధులు నాగరాజు, సౌత్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉదయ్ కిరణ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు..

టీసీఎస్ ఇంటర్వ్యూలకు వివేకానంద విద్యార్థులు

విశాలాంధ్ర-చల్లపల్లి : ఈనెల 9వ తేదీన విజయవాడలో నిర్వహించిన టీసీఎస్(ఎన్క్వాటి) పరీక్షలో చల్లపల్లి శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బికాం, బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు 58 మంది పరీక్షకు హాజరుకాగా, శనివారం ఫలితాలు విడుదల చేయగా 19 మంది విద్యార్థులు 60శాతంపైగా మార్కులు సాధించి ఫైనల్ ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. అర్హత సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్బాబు, కంప్యూటర్స్ హెడ్ పి.శంకరరావు, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు. విద్యార్థులకు రెండు నెలలుగా సాయంత్రం రెండు గంటలపాటు శిక్షణ ఇప్పించటం జరిగిందనీ, మారుమూల పల్లెల్లో సాధారణ పేద కుటుంబాలకు చెందిన తమ కళాశాల విద్యార్థులు టెక్నికల్ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోకుండా సాఫ్ట్వేర్ ఉద్యోగాలు సాధిస్తున్నారని కళాశాల యాజమాన్యం సంతోషం వ్యక్తంచేసింది.

హనుమంతపురంలో రోటరీ వైద్య శిబిరం

విశాలాంధ్ర - పమిడిముక్కల : హనుమంతపురం (గడ్డిపాడు) లో రోటరీ క్లబ్ ఉయ్యూరు వారిచే నేత్ర, దంత వైద్య శిబిరము నిర్వహించినట్లు రోటరీ అధ్యక్షులు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాధరాజు డాక్టర్ సరిత డాక్టర్ వరలక్ష్మి లచే 129 కి బిపి షుగర్ , నేత్ర దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. దీనిలో కంటి ఆపరేషన్ చేయించుకోవాల్సిన ఆరుగురికి ఉయ్యూరు రోటరీ వైద్యశాలలో ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తామని నాగ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో కెసిపి మేనేజర్ ఆర్ రామచంద్రరావు రోటరీ కార్యదర్శి మీర్జా అమీర్ స్థానికులు లింగమనేని బాబురావు కెసిపి వ్యవసాయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు టంగుటూరి

విశాలాంధ్ర - ఉయ్యూరు : తన సర్వస్వం కోల్పోయిన దేశ స్వతంత్రం కోసం ధైర్యంగా నిల బడిన మహోన్నత దీశాలి టంగుటూరి ప్రకాశం పంతులు అని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జివిస్ వి శేషగిరిరావు అన్నారు. టంగుటూరి 153 వ జయంతిని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ తుపాకీ గుండుకు రొమ్ము విరిచి ఎదురొడ్డి నిలిచిన టంగుటూరి త్యాగాలు మరువలేనివని ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు అనిర్వచనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పిఏపిఆర్డి కోటేశ్వరరావు కార్యాలయ సూపరింటెంట్ శంకర్రావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,ఉపాధి హామీ సిబ్బంది,డ్వాక్రా గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలను అందరూ సంతోషంగా జరుపుకోవాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గుడివాడ : గుడుల వాడగా ప్రసిద్దిగాంచిన గుడివాడలో ఆధ్యాత్మిక వైభవం మరింత పెంపొందేలా గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక రాజేంద్రనగర్లోని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వగృహంలో మెయిన్ రోడ్డులోని శ్రీ విగ్నేశ్వర స్వామి వారి దేవాలయంలో ఈనెల 27వ తేదీ నుండి జరగనున్న గణపతి నవరాత్ర మహోత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే రాము ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజలందరిపై ప్రథమ పూజ్యుడు వినాయకుడు ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ సాయన రాజేష్, ఈవో యార్లగడ్డ వాసు, సభ్యులు లోయ వాసు, పంచమర్తి శ్రీనివాసులు, రమణమూర్తి, పోతురాజు, వీరమాచినేని శైలజ, విజయలక్ష్మి, శారద, దుర్గభవాని, గణపతిశాస్త్రి, దేవదాయశాఖ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి నిర్మూలనపై అవగాహన

విశాలాంధ్ర - కంచికచర్ల : ఆంధ్రప్రదేశ్ ఏయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాలు మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఏయిడ్స్ నివారణ , నియంత్రణ విభాగం సహకారంతో శనివారం కృష్ణ వెన్నెల మహిళా సొసైటీ సిసి ప్రాజెక్ట్ అర్ధర్యంలో ఐఈసి క్యాంపైన్ కార్యక్రమం ద్వారా హెచ్ ఐ వి, ఏయిడ్స్ పై అవగాహనా సదస్సు కంచికచర్ల లోనే జడ్పీహెచ్ స్కూల్ ఆవరణం లో జరిగింది. ఈ కార్యక్రమం లో భాగంగా ప్రాజెక్ట్ ప్రతినిధి బి ప్రసాద్ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి కరకాలు ఎలా వాపించును, హెచ్ఐవి యొక్క లక్షణాలు అవి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో హెచ్ఐవి , ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా సమాజం లో ఎలా కలిసి జీవించాలో హెచ్ఐవి, ఎయిడ్స్, క్షయ వ్యాధి సంభందం గురించి, సుఖవ్యాధులు , చికిత్స గురించి హెచ్ఐవి యాక్ట్, 2017, ఏఆర్టి మందులు ఏపి సిఏఎస్ టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలుపుతూ మీ ద్వారా తెలియని వారికీ తెలియపరచడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ పి.సుబ్బారెడ్డి సహకారం తో నిర్వహించారు. దీనిలో కివి ఎంఎస్ సిబ్బంది, పీర్ ఎడ్యుకేటర్స్, పాల్గొన్నారు.

తల్లిదండ్రులను రోడ్లపై వదలకండి : ఆర్కె

విశాలాంధ్ర - గుడివాడ : నవ మాసలు కని పెంచి పోషించిన తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం వహించ వద్దని బిజెపి పట్టణాధ్యక్షుడు డా॥మాచర్ల రామ కృష్ణ(ఆర్.కె) అన్నారు. శనివారం స్థానిక పెద్ద కాలువ సెంటర్లో వృద్దురాలు 2రోజులు నుంచి అక్కడే ఉండ దంతో అక్కడ ఉన్న స్థానికులు ఆర్కే వారియర్స్కి తెలియజేయగా వెంటనే స్పందించి ఆమెను ఆర్కె బేతవోలు శాంతి వృద్దుల ఆశ్రమంలో చేర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మనకి జన్మనిచ్చిన తల్లిదండ్రులను చివరి దశలో జాగ్రత్తగా చూసుకుంటూ సేవ చేసుకోవాలన్నారు. నిజమేనా దేవుళ్ళు ఎవరైనా ఉన్నారంటే అది మనకు జన్మనిచ్చిన అమ్మానాన్న అని గుర్తు చేశారు. అలాంటివారికి ఎంత సేవ చేసుకున్న మనం రుణం తీర్చుకోలేమని, గత రెండు రోజులుగా వృద్దురాలు పెద్దకాలవ సెంటర్లో ఉండడంతో అక్కడ ఉన్న స్థానికులు మాకు తెలియజేయగా ఆ వృద్దుల్ని ఈ ఆశ్రమంలో చేర్పించడం జరిగిందన్నారు. ఆశ్రమంలో అడిగిన వెంటనే స్పందించిన శాంతి వృద్ధాశ్రమం అధినేత డాక్టర్ అప్పిగట్ల జామవాకి మా ఆర్కే వారియర్స్ తరపున ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లంకా రాంబాబు, గాదె చరణ్, ఆర్కే వారియర్స్ పాల్గొన్నారు.

ప్రతి వ్యాపారుస్తుడు ట్రైడ్ లైసెన్స్ తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర - గుడివాడ : పట్టణ పరిధిలోని ప్రతి వ్యాపారస్తుడు ట్రైడ్ లైసెన్స్ కలిగి ఉండాలి, లేని వారిపై మున్సి పల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిష నర్ మనోహర్ తెలిపారు. ఈ సందర్బంగా అయనను కలసి విలేకర్లుతో మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ప్రతి వ్యాపారస్తుడు ట్రైడ్ లైసెన్స్ పొందాలన్నారు. ట్రేడ్స్ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారము అప్లికేషన్ పూర్తి చేసి, నిర్ణీత ఫీజు చెల్లించి ప్రతి వ్యాపారస్తుడు తప్పనిసరిగా ట్రేడ్స్ లైసెన్స్ పొందాలన్నారు. అవగాహన లేముతో కొందరు వ్యాపారస్తులు ట్రైడ్ లైసెన్స్ తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఇప్పటికే స్పెషల్ డ్రైవ్లను మొదలుపెట్టామన్నారు. గత 15 రోజుల వ్యవధిలో 3 వందల మంది వ్యాపారస్తులు కొత్తగా లైసెన్సులు పొందినట్లు తెలిపారు. లైసెన్సులు లేని వ్యాపారస్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతుబజార్లో ప్లాస్టిక్ను నిషేధించాలి

విశాలాంధ్ర - చల్లపల్లి : చల్లపల్లి రైతుబజారులో క్యారీబ్యాగ్గను నిషేధించాలని ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలని రైతుబజారు ఈవో చంద్ర మోహన్ అన్నారు. రైతుబజారులో ప్లాస్టిక్ నిషేధంపై రైతులు, కూరగాయల వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. రైతుబజారుకు వచ్చే ప్రతి ఒక్కరూ చేతిసంచిని తీసుకువచ్చేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. రైతుబజారులో క్యారీబ్యాగ్ వినియోగం చేపట్టరాదని సూచించారు. సెప్టెంబరు ఒకటవ తేదీ నుంచీ రైతుబజారులో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంటుందనీ, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రైతుబజారును ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోహాన్, రైతులు, వ్యాపారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

నగరంలో సుందరకాండ చిత్ర బృందం సందడి

విశాలాంధ్ర - విజయవాడ లబ్బీపేట : నగరంలో సుందరకాండ చిత్ర బృందం సందడి చేసింది. సుందరకాండ చిత్ర ప్రమోషన్ లో భాగంగా హీరో నారా రోహిత్, హీరోయిన్ శ్రీదేవి, మరో హీరోయిన్ వృతి వాగాని విజయవాడకు వచ్చారు. ఓ ప్రముఖ హోటల్ నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో నారా రోహిత్ మాట్లాడుతూ సుందరకాండ చిత్రం ఈనెల 27వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుందనీ,పూర్తి వినోదాత్మకంగా రూపొందించబడిన చిత్రం ఇదని తెలిపారు. సమాజంలోని ప్రతి వ్యక్తికి సాధారణ జీవితంలో ఎదురు అయ్యే సన్నివేశాలతో ఆద్యాంతం ప్రేక్షకుల్ని అలరిస్తుందన్నారు.చిన్ననాటి నుండి విజయవాడకు తరచుగా వచ్చేవాడిననీ, సీజన్ని బట్టి సినిమా తీస్తానని చెప్పారు. ఎన్టీఆర్ నటించిన వార్ టు సినిమాని నా చిత్రం ప్రమోషన్స్ అవ్వగానే చూస్తానన్నారు.ఇటీవల కాలంలో భైరవం చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించారన్నారు.ఈనెల 27వ తేదీన వినాయక చవితి చేసుకొని సుందరకాండ చిత్రాన్ని వీక్షించాలన్నారు.సోలో చిత్ర దర్శకుడు పరశురాముతో సోలో లాంటి చిత్రాన్ని తీస్తానన్నారు.గతంలో వెంకటేష్, చార్మి తీసిన సుందరకాండ చిత్రం లాగా ఉండదు.. పూర్తి వినోదాత్మకంగా, డ్యూయల్ లవ్ స్టోరీ తో చిత్రం ఉంటుందన్నారు. హీరోయిన్స్ శ్రీదేవి, వృతి వాగాని మాట్లాడుతూ...ఈ చిత్రంలో నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు.సుందరకాండ చిత్రంలో అవకాశం రావడం తమ అదృష్టం అన్నారు.హీరో రోహిత్ తో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందులో ఇద్దరు హీరోయిన్స్తో రోహిత్ చేసే లవ్ కెమిస్ట్రీ చాలా బాగుంటుందన్నారు.హాస్య సన్నివేశాలు ప్రేక్షకుల్ని కడుపుబ్బ నవ్విస్తాయన్నారు. ఈ సమావేశంలో చిత్ర నిర్మాత సంతోష్ పాల్గొన్నారు

మహిళా హక్కుల రక్షణ కోసం ఉద్యమిద్దాం

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : దేశంలో మహిళలు పోరాడి అనేక హక్కులు సాధించు కున్నారని, ఆ హక్కులు అమలు చేయించుకోవడానికి కూడా పోరాడాల్సి వస్తుందని, అలాగే స్త్రీ పురుష సమానత్వం కోసం, ఆర్థిక, సామాజిక విషయాల్లో కూడా స్త్రీ స్వయం నిర్ణయ అధికారం తీసుకునే హక్కు కూడా సాధించాలని స్త్రీవాద రచయిత్రి పి.సత్యవతి పిలుపునిచ్చారు. 79 సంవత్సరాల స్వాతంత్ర్యం - స్త్రీ సాధికారత అనే అంశంపై పిఒడబ్ల్యు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర స్థాయి సభ నిర్వహించారు.ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన బాలాంత్రపు ప్రసూన మాట్లా డుతూ రాజ్యాధికారం, చట్టసభల్లో 50 శాతం రిజర్వే షన్ తదితర సమస్యలే కాకుండా స్త్రీ పురుష సమాన త్వాన్ని గురించి ప్రధానంగా పిఒడబ్ల్యూ పోరాడుతుం దని దానికి తన మద్దతు ఉంటుందని ప్రకటించారు. మహిళలు తమ దైనందిన సమస్యలతో పాటు స్త్రీ పురుష సమానత్వం కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. సదస్సుకు పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు ఎం లక్ష్మి అధ్యక్ష ఉపన్యాసంలో మహిళా సాధికారత అనేది దేవత వస్త్రాల్లాగా పాలకులు మార్చి వేశారని మహి ళలకు ఉన్న హక్కులు ఎండమావులు అయిపోయాయని మహిళలు ఆర్థిక సామాజిక రాజకీయ సాధికారిక సాధించి వినియోగించుకోవాలన్నారు.పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పద్మ మాట్లాడుతూ రోజురోజుకీ మహిళలపై హింస పెచ్చరిలు పోతుందని కుటుంబాల్ని కూలదోసి, పేదల జీవితాన్ని చిత్రం చేసే మద్యాన్ని ప్రభుత్వం ప్రధాన ఆదాయ వనరుగా చేసుకోవడం సిగ్గుచేటని ఆమె తీవ్రంగా విమర్శించారు. పేదల కుటుంబాలు మైక్రో ఫైనాన్స్ దోపిడికి గురవుతున్నారని ప్రభుత్వం సంక్షేమ పథకాలను క్రమంగా రద్దు చేస్తుంద న్నారు. పిఒడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగాభవాన్ని మాట్లాడుతూ ఉపాధి కోరుతున్న మహిళలకు ఉపాధి భద్రత కల్పించలేదని అన్నారు మహిళలకు సమాజం లోనే కాదు చివరకు గుడి లోను భద్రత లేదని ధర్మస్థలి ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. పిఒడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి పి పద్మ మాట్లా డుతూ కేంద్రంలో అధికా రంలో ఉన్న బిజెపి పాలకులు వ్యవస్థల్ని తమ గుప్పెట్లో పెట్టుకొని భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నారన్నారు. రాజ్యాంగంలో తీసుకు వచ్చిన 130వ రాజ్యాంగ సవరణ రాబోయే ప్యాసిజానికి మరో మచ్చుతునకని అన్నారు. పిఒడబ్ల్యు ఉపాధ్యక్షులు ఎన్.విష్ణు మాట్లా డుతూ స్త్రీలు పోరాడి సాధించుకున్న రాజ్యాంగబద్ధ హక్కుల్ని పరిక్షించుకోకపోవడమే కాకుండా ప్రభుత్వాలు సనాతన ధర్మాన్ని పెంచి పోషిస్తుందని స్త్రీని వంటింటికి బంధించే కుట్రని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి వెట్టి భారతి, కోశాధికారి ఎస్ భారతి,రాష్ట్ర నాయకులు శాఖమూరి భారతి, రమ,దుర్గా,కుసుమ,ఈశ్వరీ, మం జుల, వెంకటలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు. ఈ మహి ళలు పాడిన పాటలు సవికులని ఉత్తేజపరిచాయి.

పురస్కార గ్రహీతలకు సత్కారం

విశాలాంధ్ర - ఉయ్యూరు : విశిష్టసేవలకు పురస్కారాలు, కరాటే పోటీల్లో పతకాలు తీసుకున్న వారికి సాత్వికియోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. సామాజిక సేవాకార్య క్రమాల్లో పాల్గొంటూ తోచిన విధంగా సాయంచేస్తూ, సేవలందిస్తున్న వాకర్స్ అసోసి యేషన్ జిల్లా మాజీ గవర్నర్, లయన్స్ క్లబ్ ప్రతినిధి నూకల వెంకటసాంబశివరావు సే వలకు గుర్తింపుగా హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ సంస్థ నుంచి ఇటీవల పొట్టిశ్రీరాములు సేవా పురస్కారఅవార్డు అందుకున్న సందర్భంగా, యోగాంధ్ర కార్య క్రమంలో యోగాభ్యాసాలు నిర్వహించి సేవలందించిన యోగా గురువు జి.కృష్ణ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ నుండి పురస్కారం అందుకు సిద్ధార్థ దో అకాడమి ఆల్ ఇండియా కరాటే చాంపియన్షిప్ పోటీలో పాల్గొని పతకాలు సాధించిన నివాస్ కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి విద్యార్థులు అకాడమి ప్రెసిడెంట్ డి.శ్రీని వాస్లను ఘనంగా సత్కరించారు. సాత్విక్ యోగా సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

నిబంధనలు ఉల్లంఘించరాదు

- అవాంఛనీయ సంఘటనలకు కమిటీదే బాధ్యత
- డీజేలకు అనుమతి లేదు : సిఐ

విశాలాంధ్ర - ఉయ్యూరు : వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించేవారు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఏవిధమైన సంఘటనలు జరిగినా కమిటీదే బాధ్యత అని ఉయ్యూరు పట్టణ సిఐ టీ వీవీ రామారావు అన్నారు. పట్టణ పరిధిలో వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకు లు, డీజే, మైక్ లైటింగ్ సర్వీసుల వారితో శనివారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రతి మండపానికి సింగ్ విండో సిస్టం ద్వారా అనుమతులు సులభతరం చేశామన్నారు. మండపాల వద్ద, ఊరేగింపులో ఎటువంటి డీజేలకు అనుమతి లేదని, ఇతరులను రెచ్చగొట్టే విధంగా, డీజే పాటలు, ఇతర కార్యకలాపాలు చేపడితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. డీజే బాక్సు పెడితే సీజ్‌చేసే బాక్సు పెట్టిన వారిపై కేసునమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఎస్ఐ వసంతకుమార్ పాల్గొన్నారు.

జాన్సన్‌కు ఎంఈఓ అభినందనలు

విశాలాంధ్ర - ఎ.కొండూరు : ఎ.కొండూరు మండలం రేపూడి తండా గ్రామానికి చెందిన భూక్యా జాన్సన్ శుక్రవారం విడుదలైన డీఎస్సీ సెకండరీ గ్రేడ్ టీచర్స్ పరీక్షల్లో ఉభయ కృష్ణాజిల్లాలో 95.4 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. శనివారం ఎ. కొండూరు ఎంఈఓ కార్యాలయంలో జాన్సన్‌ను ఎంఈఓ ఈ ఎల్ ని కేశవరావు, కార్యాలయ సిబ్బం ది, డి.సురేష్.ఎన్. భవాని శంకర్, జి నాగ పండు తో పాటు జాన్సన్ తల్లిదండ్రులు తండావాసులు అభినందించి విద్య తోనే అభివృద్ధి, విద్యలోనే సమస్త జ్ఞాన సంపద దాగి ఉందన్నారు.

పరిశ్రమల స్థాపనకు ఆర్‌టీఐహెచ్ కీలకం

- జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

విశాలాంధ్ర - విజయవాడ : యువ మేధస్సుకు పదునుపెట్టి, ఆపై ప్రోత్సహించి పరి శ్రమల స్థాపనకు ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) కీలక పాత్ర పోషిస్తుందని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ అన్నారు. ఎనికేపాడులోని ఆర్‌టీఐ హెచ్ స్పోక్ కార్యాలయానికి సంబంధించి సీఈవోగా జి.కృష్ణన్, ఇంక్యుబేషన్ హెడ్‌గా డి.రవితేజకు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ కలెక్టరేట్‌లో శనివారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సంద ర్భంగా సీఈవో, ఇంక్యుబేషన్ హెడ్‌లకు జేసీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లా డుతూ కొత్త ఆవిష్కరణలకు రాష్ట్రాన్ని వేదికగా తీర్చిదిద్దేందుకు అమరావతిలో రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్‌తో పాటు దీనికి అనుసంధానంగా విజయవాడతో పాటు రాష్ట్రంలో మొత్తం అయిదు ప్రాంతాల్లో స్పోక్‌లను ముఖ్యమంత్రి ప్రారంభించారని ఆర్‌టీఐహెచ్ స్ఫూర్తికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది బృంద స్ఫూర్తితో పనిచేసి సంస్థను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఐహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

విశాలాంధ్ర - గుంటూరు సిటీ: ప్రభుత్వం కల్పించిన వసతి గృహ అవకాశాలను విద్యార్థినులు అందరూ వినియోగించుకొని, విద్యార్థినులు బాగా కష్టపడి చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పట్టాభిపురం సాంఘీక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహ సంక్షేమాధికారిణి కె.అనురాధ, సహాయ సంక్షేమాధికారి జి.శైలజ పేర్కొన్నారు. స్థానిక పట్టాభిపురంలోని సాంఘీక సంక్షేమ శాఖ కళా శాల బాలికల వసతి గృహం నందు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తల్లి దండ్రుల, విద్యార్థినుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమాధికారిణి అనురాధ, సహాయ సంక్షేమాధికారి శైలజ లు మాట్లాడుతూ విద్యార్థినులు మారుతున్న కాలానికి అనుగుణంగా వివిధ రకాల కోర్సుల నేర్చుకొని, ఉపాధి మార్గాలు త్వరగా వచ్చే విధంగా చూసుకోవాలని చెప్పారు. విద్యార్థినులు కావ్య, అమూల్య, సంధ్యారాణి లకు కన్వీనర్ కోటా కింద ఫీజు లేకుండా ఉచితంగా అడ్మిషన్ పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీహెచ్‌హెచ్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ కౌసల్యాదేవి, మహిళా పోలీస్ రజిత, ఆశావర్కర్ ఫారూన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-3, ఎన్-15 రహదారి నిర్వాసితులతో సీఆర్‌డీఏ అధికారుల సమావేశం

విశాలాంధ్ర - తుళ్లూరు : రాజధాని ప్రాంతంలో నిర్మాణం జరుగుతున్న ఈ-3, ఎన్-15 రహదారుల కింద ఇళ్లు కోల్పోయే గ్రామస్తులతో సీఆర్‌డీఏ అధికారులు శని వారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దొండపాడు గ్రామస్థులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసు కెళ్లారు. వారు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ స్థలాలను సీడ్ యాక్సిస్ రోడ్డుకు సమీపంలో ఇస్తే, మేము కూడా రహదారి నిర్మాణానికి కావలసిన స్థలాలను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. అధికారులు రైతుల సూచనలను సీరియస్‌గా పరిగణలోకి తీసుకోవాలని తీసుకున్న తర్వాతే స్థలాలు ఇస్తామని రైతులు అధికారులకు తెలిపారు. మైనేని వెంకట్రామయ్య అనే రైతు తనకు వచ్చిన ప్లాట్లు రోడ్డు పోటు తగిలేలా వచ్చాయని రెండు సంవత్సరాలుగా ఆ ప్లాట్లు మారవాలని సీఆర్‌డీఏ చుట్టూ తిరుగుతున్నానని ఇక తనకు తిరిగే ఓపిక లేదని బీపీ, షుగర్ అన్ని వచ్చి ఇబ్బంది పడుతున్నానని తనకు న్యాయం చేయాలని అధికారుల ముందు వాపోయారు. ఈ సమావేశంలో సీఆర్ డీఏ అధికారులు శ్రీనివాస్‌నాయక్, ఫణీంద్ర బాబు పాల్గొన్నారు.

ఆర్థిక సాక్షరతే శక్తివంతమైన సమాజానికి మూలం

విశాలాంధ్ర - తాడేపల్లి : ప్రతి కుంటుంబం ఆర్థిక సాక్షరత సాధిస్తేనే స్వయం అభివృద్ధి చెందు తుందని, పొదుపు అలవాట్లు పెం పొందించుకుని బ్యాంకింగ్ సౌక ర్యాలను వినియోగించటం, రు ణాల ద్వారా వ్యాపారాలను అభి వృద్ధి చేసుకోవటం, భవిష్యత్ భద్రత కోసం బీమా పథకాలను ఎంచుకోవటం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని కేఎల్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ అండ్ హ్యూమానిటీస్ డీన్ డాక్టర్ కిషోర్ బాబు సూచించారు. శనివారం మండలంలోని వడ్డేశ్వరం గ్రామంలో యూనివర్సిటీ ఎంబీఏ ఎన్ఎస్ఎస్ విభాగం ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్, ఎస్బీఐ కేఎల్‌యూ బ్రాంచి ఆధ్వర్యంలో స్వయం సహాయక, పొదుపు సంఘాలు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, చిరు వ్యాపారులు, గ్రామస్తులకు ఆర్థిక సాక్షరతపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రమేష్ బాబు తెలిపారు. సురక్షితమైన డిజిటల్ లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు, పొదుపు, రుణాలు, బీమా, డిజిటల్ బ్యాంకింగ్ ప్రాముఖ్యతపై ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ చైతన్య బైనీ వివరించారు. ప్రభుత్వ రాయితీలు, ఆర్థిక సేవలు, హక్కులు, పొదుపులు, క్రమంగా డిపాజిట్లు చేయటం, బ్యాంక్ ఖాతాలు ప్రారంభం, రైతులు, చిరు వ్యాపారుల కోసం రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలని ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ చైర్మన్ మేఘనారెడ్డి కొల్లి అవగాహన కల్పించారు. గ్రామస్తులు ఆర్థికంగా శక్తివంతులు కావటం వలన ఆర్థిక చైతన్యం పెరిగి గ్రామ స్థాయిలో బ్యాంకింగ్ సేవలు, పొదుపులు, రుణాలు వంటివి తెలుసుకోగలుగుతారని ఎంబీఏ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వరకుమార్ తెలియపరిచారు. కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కేవీవీ రాజు, గ్రామ పెద్దలు కత్తిక మల్లి ఖార్జునరావు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జోజప్ప, ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్ పాల్గొన్నారు.

గాజుల అలంకారంలో అమ్మవారు

విశాలాంధ్ర - గుడివాడ : స్థానిక పాటిమీద గల జగన్నాథపురంలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శనివారం శ్రావణమాసం ఆఖరి శు క్రవారం సందర్భంగా శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి భక్తుల సహాయ సహ కారములతో గాజుల అలంకరణ, సామూహిక కుంకుమార్చ నలను ఆలయ అర్చక స్వామి శ్రీ వేదాంతం అప్పలాచార్యులు సారథ్యంలో అత్యంత వైభవోపేతముగా నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి గాజుల అలంకరణలో దర్శనము ఇవ్వడంతో భక్తులు శ్రీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేశారు.

ప్రకాశం పంతులు అందరికీ ఆదర్శం

- ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

విశాలాంధ్ర - గుంటూరు వైద్యం : తెల్లదొరల తూపాకీ గుండుకు తన గుండెను ఎదు రొడ్డిన ఆయన వీరత్వం దేశదాస్య విమోచన యజ్ఞంలో ఆంధ్రులను ఒక్క తాటిపై నడిపించిన ఆయన మార్గదర్శ కత్వం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్సీ, ఆంధ్రకేసరి అభిమాన సంఘం గౌరవ అధ్యక్షులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి కొనియాడారు. ఆంధ్ర కేసరి, ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఆంధ్రకేసరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో శని వారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శంకర్‌విలాస్ సెంటర్‌లోని ప్రకా శం చౌక్‌లో జరిగిన కార్యక్రమంలో లేళ్ళ అప్పిరెడ్డి ప్రకాశం పంతులు విగ్రహా నికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అప్పిరెడ్డి మాట్లాడుతూ దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనే ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా భావించి జూలు విదిల్చిన సింహమై జీవితం కొనసాగించిన మహోన్నతుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బండా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు ఆచారి, షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, దూపాటి వంశీ, వెలుగూరి రత్నప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, వైసీపీ నాయకులు ఓర్చు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాఖ గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా కార్యదర్శి సుబ్బారత్తమ్మ

విశాలాంధ్ర-తాడేపల్లి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి శాఖ గ్రంథాలయాన్ని శనివారం గుంటూరు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంగారి సుబ్బారతమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఎక్కువమంది పాఠకులను సభ్యత్వం చేయించవలసిందిగా సూచనలు చేశారు. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చే విధంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ భాష పాల్గొన్నారు.

విశాఖలో 30న మహిళల నిరాహార దీక్షలు

- బీసీ సంఘాల పిలుపు

విశాలాంధ్ర - మంగళగిరి : బీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా కల్పించేలా మహిళా రిజ ర్వేషన్ చట్టంలో సవరణలు చేసిన తరువాతే అమలు జరగాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 30న విశాఖపట్నంలో జరగనున్న మహిళల నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని బీసీ మహిళా లోకాన్ని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కులగణన నిర్వహించి, ఆపై నియోజకవర్గాల పునర్విభజన అనంతరమే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. సవరణలు చేసి, బీసీ మహిళలకు ప్రత్యేక కోటా కల్పించిన తరువాతే చట్టాన్ని అమలు చేయాలని శంకరరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఉద్యోగ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పోరేపల్లి మహేష్, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు, ఉడత శ్రీనివాసరావు, జన్యనం వరప్రసాద్, జయలక్ష్మి, దుర్గ, దానాగౌడ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీల పనుల సామాజిక తనిఖీ

విశాలాంధ్ర-పెదనందిపాడు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం డ్వామా పీడీ వి.శంకర్ ప్రజావేదిక ద్వారా అన్ని గ్రామాల ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సీహెచ్ హనుమంతరావు, ఏపీడీ శ్యామలాదేవి, ఎంపీడీవో లక్ష్మీదేవి, ఇన్‌చార్జ్ ఏపీఓ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్య సేద్యం , భూమాతకు నైవేద్యం

విశాలాంధ్ర- కారంపూడి : మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతు కందుల రమేష్ పొలంలో పీఎండిఎస్ (30 రకాల విత్తనాలు) పంట కోత ప్రయోగం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మండల వ్యవసాయ అధికారి పోట్ల నరసింహారావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకులు సైదయ్య పాల్గొన్నారు. జూన్‌లో వేసిన ఈ పీఎండిఎస్‌లో ఆహారధాన్యాలు, పప్పులు, నూనెగింజలు, కూరగాయలు, ఆకుకూరలు, సుగంధ ద్రవ్యాలు తదితర 30 రకాల విత్తనాలు ఉన్నాయి. 5మీ×5మీ విస్తీర్ణంలో చేసిన పంట కోతలో 61.7 కిలోలు దిగుబడి రావడంతో, ఎకరాకు సుమారు 10 టన్నులు దిగుబడి లభించిందని అధికారులు తెలిపారు. దీంతో రైతులు రసాయన ఎరువుల ఖర్చును తగ్గించుకోవడమే కాకుండా, భూమి సారవంతం, కర్బన శాతం పెరుగుదల, నీటి నిల్వ సామర్థ్యం, చీడపీడల నిరోధక శక్తి పెరుగుతాయని నరసింహారావు వివరించారు. అలాగే పీఎండిఎస్ పశువుల మేతకూ ఉపయోగపడుతూ, పాలు పెరగడంలో తోడ్పడుతుందని జిల్లా సిబ్బంది అప్పలరాజు తెలిపారు. రైతులు మిరప, కంది, వరి, కూరగా యలు ప్రధాన పంటల ఈ విధానాన్ని అనుసరించాలి. పెట్టు బడి ఖర్చులు తగ్గి, భూమి ఉత్పాదక శక్తి పెరుగుతుందని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘ మహిళలు పార్వతి, నాగమణి, నాగజ్యోతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తండ్రి బాటలో తనయుడు

- ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన నాగెండ్ల రత్నకిషోర్

విశాలాంధ్ర-దాచేపల్లి : తండ్రి బాటలో పయనించిన ఓ తనయుడు తాజాగా వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాడు. దాచేపల్లి నగర పంచాయతీ ఇరికేపల్లికి చెందిన నాగెండ్ల యేషయ్య స్థానిక ఎస్టీ కాలనీలోని పాఠశాలలో ప్రధానోపాధ్యా యుడుగా చేస్తున్నారు. ఆయన పెద్ద కుమారుడు రత్న కిషోర్ ఎమ్మెస్సీ, బీఈడీ చేశారు. గ్రూప్స్ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఈ లోపు ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. వచ్చిన ఈ అవకాశాన్ని ఆయన అందిపుచ్చుకున్నారు. దాంతో 88.88 మార్కులు సాధించిన ఆయనకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 148వ ర్యాంకు వచ్చింది. కష్టపడి చదువుకొని తండ్రి బాటలో ఉపాధ్యాయ వృత్తిలోకి రత్న కిషోర్ అడుగు పెట్టబోతున్నారు.

భవిష్యత్‌తరాలకు ప్రేరణగా అంతరిక్ష పరిశోధనలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కాజాలోని ఎన్ ఎస్‌వీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇస్రో మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు మాట్లాడుతూ అంతరిక్ష పరిజ్ఞానం సైన్స్, ఇంజనీరింగ్, గణితంలో వృత్తిని కొనసాగించడానికి ముందుతరాలకు ప్రేరణ కలిగించడానికి దోహదపడుతుందన్నారు. క్లబ్ అధ్యక్షులు జి.శాంత మూర్తి మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో 2040లో చంద్రునిపైకి మానవుడిని పంపించాలని, 2026లో వ్యోమ మిత్ర రోబోను అంతరిక్షంలోకి పంపాలని, 2027లో మానవసహిత అంతరిక్ష యాత్రకు కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ప్రసన్న రాణి జాయ్, జనరల్ మేనేజర్ మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - తాడేపల్లి : ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి నులకపేటలో జనసేన పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేశారు. మరిన్ని వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, జొన్న రాజేష్, భీమిశెట్టి రాజు అండ్ ఫ్రెండ్ సర్కిల్, ఏమని శివ నాగేంద్రం, శ్రీను, భవనారాయణ, శేషగిరి, దినేష్, మల్లి, నాని, జీలగ కళ్యాణ్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి త్యాగ స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకం

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఆంధ్రుల ఆత్మ గౌరవ పతాకదారుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆజాదీ పోరాట యోధుడు, ప్రజాహిత నిరతుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరంలో తన అపూర్వ ధైర్యసాహసాలతో బ్రిటీష్ దౌర్జన్యాలకు ఎదురు నిలబడ్డారన్నారు. సైమన్ కమీషన్ వ్యతిరేక ఆందోళనలో తుపాకుల ముందు దమ్ముంటే కాల్చండి అంటూ తన ఛాతీ చూపుతూ 'దేశం కోసం ప్రాణ త్యాగానికి సిద్ధం' అని చేసిన సాహసం చరిత్రలో చెరగని అక్షరాలతో నిలిచిందన్నారు. దేశ భక్తుడిగా, న్యాయవాదిగా, సామాజిక సంస్కర్తగా, రాజకీయ నాయకుడిగా ఆయన చేసిన ప్రజాసేవ ప్రశంసనీయమని అన్నారు. ఆయన నిజాయితీ, త్యాగ స్ఫూర్తి, దేశభక్తి తరతరాల వారికి మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఏడుకొండల రెడ్డి, ఎస్బీ సీఐలు అలహరి శ్రీనివాస్, రాంబాబు, ఆర్ఐలు సురేష్, శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఏఎస్ కళాశాలలో పలు కార్యక్రమాలు

విశాలాంధ్ర - పెదనందిపాడు : స్థానిక పీఏఎస్ కళాశాలలో శనివారం స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర, జాతీయ సైన్స్ దినోత్సవం, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీర రాఘవయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ

విశాలాంధ్ర - పెదనందిపాడు : మండల పరిధిలోని వరగాని గ్రామంలో మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎస్‌డబ్ల్యూ)లో గ్రామానికి చెందిన బొల్లేపల్లి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు శనివారం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, ప్యాడ్స్ అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ కేఎఫ్ కెనడి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా పేద విద్యార్థులకు చేయూతనందిస్తున్న శ్రీనివాసరావు కుటుంబసభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.రామారావు, పంచాయతీ కార్యదర్శి బి.నాగయ్య, శ్రీనివాసరావు కుటుంబసభ్యులు కోటేశ్వరమ్మ, బాజీ బాబు, నాగేంద్రబాబు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిది

మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర-పెడన : సమాజంలోని ప్రతి పౌరుడు పర్యావరణాన్ని పరిరక్షించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పెడన మున్సిపల్ కమిషనర్ లింగం రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో రైతు బజార్ లో ఆయన పాల్గొన్నారు. అనంతరం వినియోగదారులకు వ్యాపారస్తులకు శానిటేషన్ మరియు ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న విధివిధానాలను ప్రతి ఒక్కరు పాటించాలని ఆయన అన్నారు. ప్రజల ప్రాణాలకు పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకం నిషేధించడం లో ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. ఈ ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ హరి కిషోర్, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రి తాడిచెట్టి నాంచారయ్య, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.